News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in : www.cknewstv.in

# CK NEWS
చంద్రకాంత్
తెలుగు దినపత్రిక

Website cknewstv.in

సంపుటి : 04 | సంచిక :352 | ఖమ్మం | ఆదివారం ఫిబ్రవరి 1, 2026 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad



# వెళ్లొస్తమమ్మా

## మమ్ముల్ని సల్లంగా సూడు తల్లీ

## మళ్లీ రెండేండ్లకు కలుద్దాం

- చివరి ఘట్టానికి సమ్మక్క సారలమ్మ జాతర
- గద్దెల వద్ద గిరిజన పూజారుల ప్రత్యేక పూజలు
- దోలు వాయిద్యాలు, డప్పు చప్పుళ్లనడుమ అమ్మవార్ల వన ప్రవేశం
- నాలుగు రోజుల పాటు అంగరంగ వైభవంగా సాగిన మహా జాతర
- లక్షలాదిగా తరలివచ్చిన భక్తులు

వివరాలు 2లో..



# విచారణకు సహకరిస్తా

- నందినగర్‌లో నేడు అందుబాటులో ఉంటా..
- సిట్‌కు కేసీఆర్ సమాచారం
- నా హక్కుల్ని కాలరాశారు
- చట్టాన్ని మీరు ఉల్లంఘించినా నేను గౌరవిస్తానంటూ సిట్ అధికారికి లేఖ



ఫోన్ అక్రమ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణకు హాజరవుతానని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ స్పష్టం చేశారు. హైదరాబాద్ నందినగర్‌లోని తన ఇంట్లో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు అందుబాటులో ఉంటానని.. సిట్ అధికారులు అక్కడికే వచ్చి తన వాంగ్మూలం సేకరించవచ్చని సూచించారు. ఈ మేరకు సిట్‌కు శనివారం ఆరుపేజీల సుదీర్ఘ లేఖ రాశారు. ఆ లేఖలో ఓవైపు కేసుల విచారణకు సంబంధించి పలు న్యాయస్థానాలు వెలువరించిన తీర్పులనూ

- మిగతా2లో

# ఎల్-2 లబ్ధిదారులకూ డబుల్ బెడ్‌రూం ఇళ్లు

## సెప్టెంబరులోగా అందించడానికి ఏర్పాట్లు



రాష్ట్రంలో వివిధ దశల్లో ఉన్న రెండు పడకల గదుల ఇళ్ల నిర్మాణాలు, లబ్ధిదారుల కేటాయింపులపై హౌసింగ్ శాఖ దృష్టి సారించింది. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో మొత్తం 2.90 లక్షల ఇళ్లను మంజూరు చేశారు. ఇందులో 2.31 లక్షల ఇళ్ల నిర్మాణానిక

- మిగతా2లో

## వృద్ధి మంత్రం.. పొదుపు సూత్రం..

# నేడు కేంద్ర బడ్జెట్

- నేడు కేంద్ర బడ్జెట్ 2026-27ను ప్రవేశపెట్టనున్న నిర్మలా సీతారామన్
- రక్షణ, మౌలిక సదుపాయాలు, మూలధన వ్యయంపై దృష్టి సారించే అవకాశం
- వృద్ధికి ఊతమిస్తూనే ఆర్థిక క్రమశిక్షణ పాటించడంపై ప్రభుత్వం దృష్టి
- ప్రధాని మోదీ ప్రభుత్వంలో ఇది 15వ బడ్జెట్.. నిర్మలా సీతారామన్‌కు 9వది




కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ (ఫిబ్రవరి 1న) పార్లమెంటులో 2026-27 వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈసారి బడ్జెట్‌లో వృద్ధి వేగాన్ని కొనసాగిస్తూనే, సంక్షేమ పథకాలకు, ఆర్థిక క్రమశిక్షణకు మధ్య ప్రభుత్వం సమతుల్యత పాటించనుందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా రక్షణ, మౌలిక సదుపాయాలు, మూలధన వ్యయం, విద్యుత్, అందుబాటు ధరల్లో గృహ నిర్మాణం వంటి రంగాలకు ప్రాధాన్యత ఇవ్వవచ్చని భావిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో దేశీయ వృద్ధి లక్ష్యాలకు, ద్రవ్యలోటు నియంత్రణకు మధ్య బడ్జెట్ ఒక చక్కటి సమన్వయాన్ని

- మిగతా2లో



# పాకిస్థాన్‌లో అంతర్యుద్ధం

## 12 నగరాల పై ఏకకాలంలో బాంబుల వర్షం!

పాకిస్తాన్: పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థ ఇప్పటికే కుదేలవ్వగా, ఇప్పుడు బెలూచిస్థాన్ ప్రావిన్స్‌లో చెలరేగిన హింస ఆ దేశాన్ని మరింత కలవరపెడుతోంది. శనివారం(జనవరి 31) తెల్లవారుజామున బలోచ్ లిబరేషన్ ఆర్మీ(బీఎల్‌ఏ) 'ఆపరేషన్

- మిగతా2లో

# రష్యన్ అమ్మాయిలతో సంబంధం..

## బిల్‌గేట్స్‌కు భయంకరమైన వ్యాధి!



ప్రపంచ అపర కుబేరుడు, మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ చుట్టూ మరోసారి వివాదం

- మిగతా2లో

# నిర్లక్ష్యం వద్దు



- ప్రతి డివిజన్.. వార్డులో గెలుపు ముఖ్యం
- మంత్రులు, పార్టీ నేతలకు సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం
- అమెరికా నుంచి జూమ్‌లో మున్సిపల్ ఎన్నికలపై సమీక్ష
- 4 నుంచి ముఖ్యమంత్రి బహిరంగ సభలు

- మిగతా2లో

# మహారాష్ట్ర డిప్యూటీ సీఎంగా సునేత్ర పవార్ ప్రమాణ స్వీకారం

ముంబై: నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ నేత, రాజ్యసభ ఎంపీ, దివంగత అజిత్ పవార్ సతీమణి సునేత్ర పవార్ మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి గా శనివారం నాడు ప్రమాణస్వీకారం చేశారు. ముంబై లోని లోక్‌భవన్

- మిగతా2లో



# వెళ్లొస్తమమ్మా..

గద్దెపై కొలువై మేడారంలో మూడు రోజులపాటు పూజలందుకున్న సమ్మక్క తల్లిని భక్తుల జయజయధ్వానాల మధ్య పూజారులు వన ప్రవేశం చేయించారు. శనివారం రాత్రి నిర్వహించిన ఈ వేడుక ఆద్యంతం ఉద్వేగభరితంగా సాగింది. అమ్మను సాగనంపే క్రతువులో గిరిజన సంగీత వాయిద్యాల చప్పుళ్లకు, కొమ్ముబూరల శబ్దాలకు భక్తులు నృత్యాలు చేశారు. శివసత్తులు పూనకాలతో ఊగిపోయారు. మిగతా గద్దెలపై పూజలందుకున్న సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులను సైతం ఆయా గొట్ల పూజారులు తమ ప్రాంతాల్లోని ఆలయాలకు తీసుకెళ్లారు. ఆదివాసీ పూజారులు సమ్మక్కను గద్దె నుంచి తీసుకొని చిలకలగుట్టకు చేర్చే వరకు దారిపొడవునా భక్తులు వెంటనడిచారు. మంత్రి సీతక్క, ములుగు కలెక్టర్ దివాకర, ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ సహా పలువురు ఉన్నతాధికారులు వనప్రవేశ వేడుకలో పాల్గొన్నారు. మరోవైపు సారలమ్మను రాత్రి సమయంలో కన్నెపల్లి, గోవిందరాజును ఏటూరునాగారం మండలం కొండాయికి చేర్చారు. పగిడిద్దరాజు కూడా రాత్రి సమయంలో బయలుదేరినా... మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్లలోని గుడిలోకి ఆదివారం ఉదయం ప్రవేశం చేయించనున్నారు.

**నాలుగో రోజూ భక్తుల రద్దీ**

శనివారం ఉదయం నాటికి రద్దీ కొంతమేరకు తగ్గిపోయింది. భక్తులు నేరుగా గద్దెల వద్దకు చేరుకొని వన దేవతలను దర్శించుకున్నారు. అయితే, వివిధ ప్రాంతాల నుంచి మేడారానికి రావాల్సిన వేల సంఖ్యలో వాహనాలు శుక్రవారం రాత్రి నుంచి శనివారం మధ్యాహ్నం వరకు ట్రాఫిక్‌లో చిక్కుకున్నాయి. దీంతో శనివారం మధ్యాహ్నం తర్వాత మళ్లీ క్యూలైన్లు నిండుగా మారాయి.

**రాత్రంతా వాహనాల్లోనే అవస్థలు**

జాతరలో మొక్కుల సమర్పణ తర్వాత శుక్రవారం సాయంత్రం బస్సులు, సొంత వాహనాల్లో వెనుదిరిగిన భక్తులు ట్రాఫిక్‌లో చిక్కుకుని రాత్రంతా వాహనాల్లోనే నానాఅవస్థలు పడ్డారు. మేడారం-తాడ్వాయి(13 కిలో మీటర్లు), తాడ్వాయి-పస్రా (20 కిలోమీటర్లు) మార్గాల్లో వందల సంఖ్యలో ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి. అర్ధరాత్రిలోపే హైదరాబాద్‌కు వెళ్లాల్సిన వాహనాలు ఉదయం 8 గంటలకుగానీ చేరలేదు. హనుమకొండ నుంచి మేడారానికి మూడు గంటల్లో రావాల్సిన భక్తులకు ఏకంగా పది గంటల సమయం పట్టింది. ఈ క్రమంలో ప్రయాణికులు తీవ్ర అసహనానికి గురై ములుగు సమీపంలో ఆర్టీసీ బస్సు అద్దాలను ధ్వంసం చేశారు. రోడ్ల విస్తరణ చేపట్టామని, ఏఐను వినియోగించి యాప్ ద్వారా ట్రాఫిక్ చిక్కులకు చెక్ పెడతామని అధికారులు చెప్పినా... శనివారం మధ్యాహ్నానికిగానీ సమస్య తొలగలేదు.

గద్దెల వద్ద రద్దీ నియంత్రణలోనూ విఫలం

మేడారంలోని గద్దెల ప్రాంగణం, క్యూలైన్లను విస్తరించామని, ఈసారి ఏకకాలంలోనే ఎక్కువ మంది భక్తులు దర్శించుకుంటారని, తోపులాటలు ఉండబోవని అధికారులు జాతర ముందు నుంచి చెబుతూ వచ్చారు. అయితే, వారు చెప్పిన మాటలకు వాస్తవ పరిస్థితులకు పొంతన కుదరలేదు. గద్దెల ప్రాంగణానికి వెళ్లే మార్గంలో ఏర్పాటు చేసిన గేట్లకు తాళాలు వేసి అవసరమైన సందర్భాల్లో తీయకపోవడంతో తోపులాట చోటుచేసుకొని కొందరు భక్తులు గాయపడ్డారు. పోలీసు, దేవాదాయ శాఖలకు చెందిన అధికారులు అందుబాటులో ఉండి పర్యవేక్షిస్తుంటే... కిందిస్థాయి సిబ్బంది సమయస్ఫూర్తితో వ్యవహరించి సమస్య రాకుండా చేసేవారు. అయితే, పర్యవేక్షణ విధుల్లో ఉండే వారంతా ఉన్నతాధికారుల సేవలకు ప్రాధాన్యమిచ్చి... కిందిస్థాయి సిబ్బందిని వదిలేశారనే విమర్శలున్నాయి.

# నిర్లక్ష్యం వద్దు

: మున్సిపల్ ఎన్నికల్లో ఏమాత్రం నిర్లక్ష్యం వహించకుండా గెలిచే సత్తా ఉన్నవారిని ఎంపిక చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ నేతలకు, మంత్రులకు సూచించారు. శనివారం అమెరికా నుంచి జూమ్‌లో పార్టీ ముఖ్య నేతలతో ఆయన ఎన్నికలపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, పార్టీ సీనియర్ నాయకులు డీసీసీ అధ్యక్షులు పాల్గొన్నారు. సీఎం మాట్లాడుతూ... "సామాజిక సమతౌల్యం, గెలుపు, విధేయతలను ప్రామాణికంగా తీసుకుని మాత్రమే అభ్యర్థులను ఎంపిక చేయాలి. వ్యక్తిగత ఇష్టాలు, ఒత్తిళ్లలో పార్టీ టికెట్లు కేటాయించవద్దు. ప్రతి డివిజన్, ప్రతి వార్డు గెలుపు ముఖ్యం. అందుకు అనుగుణంగా గెలుపు గుర్రాలను గుర్తించాలి. భారాస, భాజపా అభ్యర్థులకు దీటుగా కాంగ్రెస్ అభ్యర్థులు ఉండాలి. నామినేషన్ల ప్రక్రియ పూర్తి కావడంతో తదుపరి కార్యాచరణపై పార్టీ లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌ఛార్జులంతా దృష్టిపెట్టాలి. ప్రధానంగా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను క్షేత్ర స్థాయికి తీసుకెళ్లడం, నాయకులు సమన్వయంతో పనిచేయడం లాంటి అంశాలను ముఖ్య నేతలు పర్యవేక్షించాలి. ప్రతిపక్షాల ఎత్తులకు పైఎత్తులతో ఎన్నికలను ఎదుర్కొనేందుకు పార్టీ యంత్రాంగమంతా సిద్ధంగా ఉండాలి. గత ఎన్నికల ఫలితాలను పరిశీలించి బలహీనంగా ఉన్న మున్సిపాలిటీలు, వార్డులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ప్రభుత్వ పథకాల వివరాలను ఇంటింటికి వివరించాలి. లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, మంత్రులు.. నాయకుల మధ్య అంతరం లేకుండా చూడాలి. బరిలో రెబెల్స్‌ను విరమింపజేసేందుకు ప్రతి ఒక్కరితో మాట్లాడి సమన్వయం చేసుకోవాలి" అని చెప్పినట్లు పార్టీ వర్గాలు వివరించాయి. 'సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం రాత్రి హైదరాబాద్ చేరుకుంటారు. సోమవారం నుంచి అందుబాటులో ఉంటారు. 4వ తేదీ నుంచి 9 వరకు ఎన్నికల బహిరంగసభల్లో పాల్గొని ప్రసంగిస్తారు' అని పార్టీ నేతలు వివరించారు. ఈ నెల 4న మిర్యాలగూడ, 5న చొప్పదండి, 6న నిజామాబాద్, 7న పరిగి, 8న భూపాలపల్లి, 9న మెదక్‌లలో బహిరంగసభలు ఉంటాయని తెలిపారు. ఒక్కో సభకు కనీసం లక్షమంది వరకు హాజరయ్యేలా చూడాలని పార్టీ యోచిస్తోంది.

**తిరుగుబాటు అభ్యర్థులుగా బరిలో నిలవకుండా..**

ఎన్నికల్లో తమకే టికెట్ వస్తుందని కాంగ్రెస్ పేరుతో పెద్దసంఖ్యలో అభ్యర్థులు నామినేషన్లు వేసినందున బీ-ఫారాల పంపిణీలో జాగ్రత్తలు తీసుకోవాలని, ఇన్‌ఛార్జి మంత్రులతో పంపిణీ చేయించాలని పీసీసీ నిర్ణయించింది. టికెట్ రానివారు గొడవలకు దిగకుండా, తిరుగుబాటు అభ్యర్థులుగా బరిలో నిలవకుండా ముందుగానే వారితో చర్చించాలని స్క్రీనింగ్ కమిటీలకు సూచించింది. నిజంగా ప్రజల్లో బలమున్నవారు ఎవరనేది సర్వే ద్వారా గుర్తించి కమిటీ సమావేశంలో చర్చించాలని నిర్దేశించింది. ఆది, సోమవారాల్లో అభ్యర్థుల గుర్తింపు కార్యక్రమాలన్నీ పూర్తిచేయడానికి అన్ని చర్యలు తీసుకోవాలని కమిటీలకు సూచించింది. ప్రతి వార్డు లేదా డివిజన్ గెలుపును కమిటీ వ్యక్తిగత ప్రతిష్ఠగా భావించి బీ-ఫారాల పంపిణీ చేయాలని ఆదేశించింది.

# ఎల్-2 లబ్ధిదారులకూ డబుల్ బెడ్‌రూం ఇళ్లు

- మొదటి పేజి తరువాయి

టెండర్లు పిలిచి పనులు చేపట్టారు. ఇప్పటి వరకు 1.62 లక్షల ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. ఇందులో 1.46 లక్షల ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించారు. మరో 1.54 లక్షల ఇళ్లకు లబ్ధిదారులను ఎంపిక చేయాల్సి ఉంది. ఈ ఇళ్లలో కొన్ని ఇప్పటికే నిర్మాణాలు పూర్తికాగా, మరికొన్ని వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయి. వాటిని సెప్టెంబరు నాటికి పూర్తి చేసి లబ్ధిదారులకు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రజాపాలన దరఖాస్తుల్లో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం 77.68 లక్షల విజ్ఞప్తులు వచ్చాయి. దరఖాస్తుదారుల్లో స్థలాలు ఉన్నవారిని ఎల్-1గా, స్థలాలు లేనివారిని ఎల్-2గా, అనర్హులను ఎల్-3గా గుర్తించారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం స్థలాలు ఉన్నవారికే (ఎల్-1 జాబితా) ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం రూ.5 లక్షల చొప్పున కేటాయిస్తోంది. ఎల్-2 జాబితాపై ఇప్పటి వరకు ఉత్కంఠ కొనసాగగా..

తాజాగా రెండు పడకల గదుల ఇళ్లను ఎల్-2 జాబితాలో ఉన్న లబ్ధిదారులకు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ జాబితాలో 21.49 లక్షల మంది దరఖాస్తుదారులు ఉన్నారు. అందులో పేదలను ఎంపిక చేసి రెండు పడకల గదుల ఇళ్లను అందించడానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది.

హౌసింగ్ శాఖ పరిధిలోకి రావడంతో..

గత ప్రభుత్వం హౌసింగ్ శాఖను ఆర్అండ్‌బీలో విలీనం చేసింది. జిల్లాల్లో రెండు పడకల గదుల ఇళ్ల నిర్మాణాలను అక్కడి పరిస్థితులకు అనుగుణంగా ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖలకు కలెక్టర్లు అప్పగించారు. అయితే, రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత రెండు పడకల గదుల ఇళ్లపై పూర్తి అధికారాలను హౌసింగ్ శాఖకు కేటాయిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆరు నెలల కిందటే రెండు పడక గదుల ఇళ్ల వద్ద మంచి నీరు, విద్యుత్, డ్రైనేజి వ్యవస్థల కోసం ప్రభుత్వం రూ.391.23 కోట్లను కేటాయించి పనులను చేపడుతోంది. వీటిని త్వరితగతిన పూర్తి చేసి ఎల్-2 లబ్ధిదారులకు అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది.

# రష్యన్ అమ్మాయిలతో సంబంధం..

-మొదటిపేజీ తరువాయి

ముసురుకుంది. లైంగిక వేధింపుల కేసులో నిందితుడిగా ఉండి జైల్లో ఆత్మహత్య చేసుకున్న జెఫ్రీ ఎప్‌స్టీన్ దర్యాప్తు పత్రాలను అమెరికా న్యాయశాఖ తాజాగా విడుదల చేసింది. ఈ పత్రాల్లో బిల్ గేట్స్ పై అత్యంత వివాదాస్పద మైన, షాకింగ్ ఆరోపణలు వెలుగు లోకి వచ్చాయి. అమెరికా డిప్యూటీ అటార్నీ జనరల్ టాడ్ బ్లాంచ్ శుక్రవారం నాడు దాదాపు 30 లక్షల పేజీల పత్రాలు, 2,000 వీడియోలు, 1,80,000 చిత్రాలను బహిరంగ పరిచారు. జెఫ్రీ ఎప్‌స్టీన్ కేసులో పారదర్శకత కోసం ఈ కీలక ఫైల్స్‌ను విడుదల చేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ పత్రాల్లో ప్రధానంగా బిల్ గేట్స్ కు సంబంధించిన కొన్ని ఈమెయిల్స్ చర్చనీయాంశంగా మారాయి. విడుదలైన డాక్యుమెంట్లలో ఎప్స్టీన్ రాసిన కొన్ని ఈమెయిల్ డ్రాఫ్టులు వైరల్ అవుతున్నాయి. వీటిలో బిల్ గేట్స్ పై సంచలన ఆరోపణలు ఉన్నాయి. ఆ పత్రాల ప్రకారం రష్యన్ అమ్మాయిలతో శారీరక సంబంధం పెట్టు కోవడం వల్ల బిల్ గేట్స్‌కు ఒక లైంగిక వ్యాధి సోకిందని, దానిని ఆయన తన భార్య మెలిండా గేట్స్ నుంచి దాచాలని ప్రయత్నించారని జెఫ్రీ ఎప్‌స్టీన్ పేర్కొన్నాడు. తన వ్యాధి మెలిండాకు వ్యాపించకుండా ఉండేందుకు లేదా ఆమెకు చికిత్స చేయడానికి, ఆమెకు తెలియకుండానే యాంటీబయాటిక్స్ ఇచ్చేలా ఏర్పాట్లు చేయమని బిల్‌గేట్స్ కోరినట్లు ఎప్‌స్టీన్ రాశాడు. గేట్స్ తన 'వ్యాధి' పరిణామాలను ఎదుర్కోవడానికి మందులు పొందడంలో తాను సహాయం చేశానని, అలాగే బ్రిడ్జ్ టోర్నమెంట్ల కోసం ఆయనకు 'అడ్డెరల్' వంటి మందులను సరఫరా చేయాలని తనను అడిగారని ఎప్‌స్టీన్ ఈమెయిల్స్‌లో ఆరోపించాడు. ఈ పత్రాలను చూస్తే.. ఎప్‌స్టీన్బిల్ గేట్స్ ను బ్లాక్ మెయిల్ చేయడానికి ప్రయత్నించినట్లు స్పష్టమవుతోంది. 2017 లో ఒక రష్యన్ బ్రిడ్జ్ ప్లేయర్ (మిలా ఆంటోనోవా)తో గేట్స్‌కు ఉన్న సంబంధాన్ని బయట పెడతానని ఎప్‌స్టీన్ బెదిరించినట్లు కూడా గతంలో వార్తలు వచ్చాయి. తన ఛారిటీ ఫండ్స్‌లో గేట్స్ పెట్టుబడి పెట్టలేదన్న కోపం తోనే ఎప్‌స్టీన్ ఈ పనులకు ఒడిగట్టినట్లు తెలుస్తోంది. ఈ ఆరోపణల పై బిల్ గేట్స్ ప్రతినిధి స్పందిస్తూ.. ఇవన్నీ అసంబద్ధ మైన, పూర్తిగా తప్పుడు ఆరోపణలు. ఎప్‌స్టీన్ తనతో సంబంధం కొనసాగించనందుకు కలిగిన అసహనంతో బిల్ గేట్స్ ప్రతిష్టను దెబ్బతీయడానికి చేసిన కుట్ర ఇది అని స్పష్టం చేశారు. గేట్స్ ఇప్పటికే ఎప్‌స్టీన్‌తో గతంలో స్నేహం చేయడం తన జీవితంలో చేసిన 'పెద్ద తప్పు' అని అంగీకరించారు. బిల్ గేట్స్, మెలిండా 2021 లో విడాకులు తీసుకున్నారు. అప్పట్లోనే మెలిండా మాట్లాడుతూ.. బిల్ గేట్స్‌కు ఇతర మహిళలతో ఉన్న సంబంధాలు, జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో ఆయన సాన్నిహిత్యం తమ విడాకులకు ప్రధాన కారణమని పేర్కొన్నారు. తాజా ఫైల్స్ ఆ అనుమానాలను మరింత బలపరుస్తున్నాయి.

# పాకిస్థాన్‌లో అంతర్యుద్ధం

-మొదటిపేజీ తరువాయి

హేరాఫ్ రెండో దశలో భాగంగా ఏకకాలంలో 12 నగరాల పై దాడులు చేసింది. క్వెట్టా, గ్వాదర్, చమన్, మస్తుంగ్, నుష్కి వంటి ప్రధాన నగరాల్లోని పోలీస్ స్టేషన్లు, ప్రభుత్వ భవనాలే లక్ష్యంగా ఈ దాడులు జరిగాయి. శనివారం ఉదయం 6 గంటల సమయంలో క్వెట్టా లోని సరియాబ్ రోడ్డులో పోలీస్ వాహనం పై బాంబు దాడి, కాల్పులతో ఈ హింస ప్రారంభమైంది. మస్తుంగ్‌లో పోలీస్ స్టేషన్‌ను తిరుగు బాటుదారులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. అక్కడ ఉన్న 30 మందికి పైగా ఖైదీలు తప్పించుకున్నట్లు సమాచారం. నుష్కిలోని సీటీడీ కార్యాలయం పై జరిగిన దాడిలో 8 మంది భద్రతా సిబ్బంది మరణించారు. బలోచ్ లిబరేషన్ ఆర్మీ కమాండర్-ఇన్-చీఫ్ బషీర్ జెబ్ బలోచ్ ఒక వీడియో సందేశాన్ని విడుదల చేస్తూ, బలోచ్ ప్రజలందరూ ఈ తిరుగుబాటులో చేరాలని పిలుపునిచ్చారు. చరిత్ర రాయాలంటే ప్రాణాలు ఇవ్వాలి లేదా తీసుకోవాలి అంటూ ఆయన వ్యాఖ్యానించారు. పాక్ సైన్యం ఎదురుకాల్పులు పాకిస్థాన్ అధికారిక వర్గాల ప్రకారం.. ఈ దాడుల్లో ఇప్పటివరకు 10 మంది భద్రతా సిబ్బంది మరణించగా ఎదురుకాల్పుల్లో సుమారు 37 మంది తిరుగుబాటుదారులు హతమయ్యారు. గడిచిన 48 గంటల్లో మొత్తం 70 మందికి పైగా తిరుగుబాటుదారులను చంపినట్లు సైన్యం ప్రకటించింది. బెలూచిస్థాన్ అంతటా మొబైల్ డేటా సేవలను నిలిపివేశారు. ఆసుపత్రుల్లో ఎమర్జెన్సీ ప్రకటించారు. బెలూచిస్థాన్ ను పాకిస్థాన్ నుంచి విడదీసి స్వతంత్ర దేశంగా మార్చాలని బలోచ్ లిబరేషన్ ఆర్మీ దశాబ్దాలుగా పోరాడుతోంది. తమ ప్రాంతం లోని సహజ వనరులను (ముఖ్యంగా చైనా సహకారంతో చేపట్టిన సీపెక్ ప్రాజెక్టుల ద్వారా) పాక్ ప్రభుత్వం దోచుకుంటోందని వారు ఆరోపిస్తున్నారు. పాకిస్థాన్, అమెరికా, బ్రిటన్ దేశాలు బలోచ్ లిబరేషన్ ఆర్మీని ఉగ్రవాద సంస్థగా ప్రకటించాయి. ప్రస్తుతం గ్వాదర్, క్వెట్టా వంటి నగరాల్లో 'క్లియరెన్స్ ఆపరేషన్' కొనసాగుతోంది. పాక్ సైన్యం అనేక పోస్టులను వదిలి వెనక్కి తగ్గుతున్నట్లు వస్తున్న వార్తలను ప్రభుత్వం ఖండించినప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం ఉద్రిక్తంగానే ఉంది.

# మహారాష్ట్ర డిప్యూటీ సీఎంగా సునేత్ర పవార్ ప్రమాణ స్వీకారం

-మొదటిపేజీ తరువాయి

ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో గవర్నర్ ఆచార్య దేవవ్రత్ ఆమె చేత ప్రమాణస్వీకారం చేయించారు. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్, మరో ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, మహాయుతి మంత్రులు, ఇతర నేతలు పాల్గొన్నారు. ఎన్‌సీపీ (ఎస్‌పీ) నేతలు శరద్ పవార్, ఆ పార్టీ ఎంపీ సుప్రియా సూలే ఈ కార్యక్రమానికి దూరంగా ఉన్నారు. సునేత్ర పవార్ ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయడంతో రాష్ట్రంలో ఆ పదవిని చేపట్టిన తొలి మహిళగా ఆమె గుర్తింపు పొందారు. అజిత్ పవార్ ఇటీవల విమాన ప్రమాదంలో మరణించడంతో ఆయన స్థానంలో డిప్యూటీ సీఎం పగ్గాలను సునేత్ర చేపట్టారు. దీనికి ముందు, శనివారం ఉదయం ఎన్‌సీపీ శాసనసభాపక్ష నేతగా సునేత్ర పవార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. లెజిస్లేటివ్ బిల్డింగ్‌లో జరిగిన సమావేశంలో సునేత్ర పేరును ఎమ్మెల్యే దిలీప్ వాల్సే పాటిల్ ప్రతిపాదించగా, ఎన్‌సీపీ మంత్రి ఛగన్ భుజ్‌బుల్ బలపరిచారు. అనంతరం ఏకగ్రీవంగా పార్టీ శాసనసభాపక్ష నేతగా సునేత్ర ఎన్నికయ్యారు. సునేత్ర పవార్ డిప్యూటీ సీఎం పదవితో చేపట్టంతో అజిత్ పవార్ చేపట్టిన శాఖలను కూడా ఆమెకు అప్పగించనున్నారని తెలుస్తోంది. అయితే అజిత్ పవార్ చేతిలోని ఆర్థిక శాఖను మాత్రం ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ తన వద్దే ఉంచుకోనున్నారని, దీనికి బదులుగా మరో శాఖను ఆమెకు అప్పగిస్తారని తెలుస్తోంది. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన సునేత్ర పవార్ కు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అభినందనలు తెలిపారు. ఈ బాధ్యతలు చేపట్టిన తొలి మహిళగా రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం, దివంగత అజిత్‌దాదా పవార్ కలలను సాకారం చేసేందుకు అవిశ్రాంతంగా కృషి చేస్తారనే నమ్మకం తనకుందని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పేర్కొన్నారు.

# వృద్ధి మంత్రం.. పొదుపు సూత్రం.. నేడు కేంద్ర బడ్జెట్

సాధించాల్సి ఉంది. ప్రభుత్వం ఇప్పటికే ఆర్థిక క్రమశిక్షణ మార్గంలో స్థిరంగా పయనిస్తోంది. కోవిడ్ సమయంలో 9.2 శాతంగా ఉన్న ద్రవ్యలోటును 2026 ఆర్థిక సంవత్సరానికి 4.4 శాతానికి తగ్గించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. ఈ మార్గం నుంచి ప్రభుత్వం పెద్దగా పక్కకు వెళ్లకపోవచ్చని విశ్లేషకులు చెబుతున్నారు.

ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వంలో ఇది 15వ బడ్జెట్ కాగా, నిర్మలా సీతారామన్ వరుసగా తొమ్మిదోసారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టి రికార్డు సృష్టించనున్నారు. గత బడ్జెట్‌లో మధ్యతరగతి వినియోగాన్ని పెంచేందుకు పన్ను రాయితీలపై దృష్టి సారించగా, ఈసారి వినియోగాన్ని ప్రోత్సహించే విధానం పరిమితంగానే ఉంటుందని తెలుస్తోంది. వ్యూహాత్మకంగా ముఖ్యమైన రంగాల్లో మూలధన వ్యయాన్ని పెంచడంపైనే ప్రభుత్వం ప్రధానంగా దృష్టి సారించవచ్చని మార్కెట్ వర్గాలు అంటున్నాయి. పెట్టుబడిదారులు ప్రభుత్వ రుణాల వివరాలు, ద్రవ్యలోటు లక్ష్యాలు, కొత్త అప్పుల ప్రణాళికలపై ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇటీవల ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే 2025-26, వచ్చే ఆర్థిక సంవత్సరానికి (ఫీ27) వృద్ధి రేటు 6.8% నుంచి 7.2% మధ్య ఉండవచ్చని అంచనా వేసింది. ఇది ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 7.4% కంటే కొంచెం తక్కువ. బడ్జెట్ ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని, ఫిబ్రవరి 1 ఆదివారం అయినప్పటికీ స్టాక్ ఎక్స్ఛేంజీలలో పూర్తిస్థాయి ట్రేడింగ్ నిర్వహించాలని నిర్ణయించారు.

# విచారణకు సహకరిస్తా

- మొదటి పేజి తరువాయి

ప్రస్తావిస్తూనే.. మరోవైపు తనకు నోటీసులు జారీ చేయడంలో సిట్ వ్యవహరించిన తీరును తప్పుబట్టారు. ఈవిషయంలో సిట్.. సుప్రీంకోర్టు తీర్పులను ఉల్లంఘించిందని.. తన రాజ్యాంగ హక్కులను కాలరాసిందని మండిపడ్డారు. అసలు సిట్ అధికారులకు నోటీసు ఇచ్చే అధికారమే లేదని పేర్కొన్నారు. చట్టపరమైన అంశాలు ఎలా ఉన్నా సరే.. మాజీ ముఖ్యమంత్రిగా, ప్రతిపక్షనేతగా దర్యాప్తునకు సహకరించాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. నందినగర్ నివాసంలోనే వాంగ్మూలం నమోదు చేస్తామని సిట్ పట్టుబట్టినందున అక్కడే అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. మరోవైపు విచారణకు హాజరవుతానని కేసీఆర్ ప్రకటించిన నేపథ్యంలో విచారణకు సంబంధించిన కార్యాచరణపై సిట్ సమాలోచనలు చేసింది. సిట్ చీఫ్ వి.సి.సజ్జనార్ నేతృత్వంలో సమావేశమై చర్చించింది. నందినగర్‌లోని కేసీఆర్ నివాసం వద్ద బందోబస్తు ఏర్పాట్లపై నగర పోలీసులు దృష్టి సారించారు.

**సిట్ నోటీసులే చట్టవిరుద్ధం**

ఎర్రవల్లిలోని నివాసంలోనే తనను విచారించాలన్న సూచనను సిట్ అంగీకరించని నేపథ్యంలో కేసీఆర్ తాజాగా జూబ్లీహిల్స్ ఏసీపీకి ఇచ్చిన సమాధానంలో పలు అంశాలను ప్రస్తావించారు. 'మీరు ఇచ్చిన నోటీసులు చట్టవిరుద్ధం. మొదటి నోటీసుకు మున్సిపల్ ఎన్నికల బిజీ నేపథ్యంలో మరో తేదీలో విచారించాలని చెప్పా. అలాగే 65 ఏళ్లపైన ఉన్న వ్యక్తులను వారు నివసించే చోటనే విచారించాలని చెప్పే 160 సీఆర్పీసీ నిబంధనను మీ దృష్టికి తెచ్చా. తదుపరి నోటీసులన్నీ ఎర్రవల్లి నివాసానికే పంపాలని సూచించా. కానీ ఇది చెప్పిన తర్వాతా.. గుర్తు తెలియని వ్యక్తులు మీ సంతకంతో ఉన్న లేఖను నందినగర్‌లోని మా ఇంటి గోడకు అతికించినట్లు తెలిసింది. ఆ లేఖ మీరే పంపినట్లయితే.. మీ సూచనల మేరకే అతికించినట్లయితే తీవ్రంగా ఆక్షేపిస్తున్నా. ఇది భారత రాజ్యాంగం, చట్టం, సుప్రీంకోర్టుల విషయంలో మీకు ఏమాత్రం గౌరవం లేదనే విషయాన్ని సూచిస్తుంది. గతంలో సతేందర్‌కుమార్ యాంటిల్ వర్సెస్ సీబీఐ కేసులో సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. వాట్సప్ లేదా ఇతర ఎలక్ట్రానిక్ మార్గాల ద్వారా నోటీసులు పంపడం చట్టబద్ధమైన పద్ధతి కాదని పేర్కొంది. చట్టం నిర్దేశించిన రీతిలోనే నోటీసులు ఇవ్వాలని సూచించింది. వ్యక్తిగతంగా అందజేయాల్సి ఉన్న 160 సీఆర్పీసీ నోటీసుల విషయంలో మీరు కావాలనే చట్టాన్ని, సుప్రీంకోర్టు ఆదేశాల్ని ఉల్లంఘించారు. ఇది కోర్టు ధిక్కరణ కిందకే వస్తుంది. భవిష్యత్తు నోటీసులన్నీ ఎర్రవల్లికే పంపాలని చెప్పినా మీరు విస్మరించారు. కాబట్టి మీరు ఇచ్చిన రెండో నోటీసు చట్టబద్ధంగా అందలేదు. అది చెల్లదు. మీరిచ్చిన నోటీసు నా రాజ్యాంగబద్ధ హక్కులను హరించడమే. నేను మీ పోలీస్‌స్టేషన్ లేదా పొరుగు పోలీస్‌స్టేషన్ పరిధిలో నివసించడంలేదు. కాబట్టి మీకు నోటీసు ఇచ్చే అధికార పరిధి లేదు. ఈ నోటీసుకు నన్ను కట్టడి చేసే అధికారం లేదు. ఎన్నికల అఫిడవిట్, అసెంబ్లీ రికార్డులో ఉన్న చిరునామా ఆధారంగా ఎర్రవల్లిలో విచారించలేమని మీరు చెప్పడం సరికాదు. నోటీసు ఇచ్చే సమయానికి వ్యక్తి ఎక్కడ నివసిస్తున్నారన్నదే ముఖ్యం. నేను కొన్నేళ్లుగా ఎర్రవల్లిలోనే ఉంటున్నా. అక్కడే నా వాంగ్మూలం నమోదు చేయాల్సిన బాధ్యత మీపై ఉంది. హరీశ్‌రావు అఫిడవిట్‌లో సిద్దిపేట అని చిరునామా ఉన్నా హైదరాబాద్‌లో నోటీసు ఇచ్చారు. మీ ద్వంద్వ ప్రమాణాలను ఇది సూచిస్తోంది. మీరు గోడకు నోటీసు అంటించడం చట్టవిరుద్ధం. అయితే చట్టపరమైన అంశాలు ఎలా ఉన్నా బాధ్యతాయుతమైన భారత పౌరుడిగా దర్యాప్తునకు సహకరించాలని నిర్ణయించుకున్నా..' అని కేసీఆర్ పేర్కొన్నారు.

**కేసీఆర్‌తో న్యాయవాదుల సమావేశం**

సిద్దిపేట జిల్లా మర్కూర్ మండలంలోని ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో శనివారం ఉదయం మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులు సమావేశమయ్యారు. ఫోన్ ట్యాపింగ్‌పై ఏర్పాటైన సిట్.. నోటీసులు జారీ చేయడంపై కేసీఆర్ న్యాయవాదులతో భేటీ అయ్యారు. సాయంత్రం సీనియర్ న్యాయవాది రాంచందర్‌రావు వచ్చి కలిశారు. ఐపీఎస్ విశ్రాంత అధికారి ప్రవీణ్‌కుమార్ కూడా కేసీఆర్‌తో సిట్ నోటీసులపై చర్చించినట్లు తెలుస్తోంది.

## ప్రజల నడకకు సౌకర్యం, భద్రత గా ఫుట్ పాత్ లు...

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- వికలాంగులు, వృద్ధులు, చిన్న పిల్లలకు అనుకూలంగా రూపొందించాలి
- ఫుట్‌పాత్ లు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా నాణ్యతా ప్రమాణాలు పాటించాలి
- ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరిసర ప్రాంతం నుండి చేపట్టనున్న ఫుట్‌పాత్ గ్రానైట్ టైల్స్ ఏర్పాటు పనుల డిజైన్‌లను పరిశీలించిన జిల్లా కలెక్టర్



**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం :** ఖమ్మం నగరంలో ఆధునిక మౌళిక వసతులతో పాటు ప్రజలకు నడకలో సౌకర్యం, ఆర్యోగం, భద్రత కల్పించే విధంగా ఫుట్ పాత్ ల నిర్మాణం చేపట్టాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిని శనివారం మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య తో కలిసి జిల్లా కలెక్టర్ తనిఖీలు చేశారు. ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరిసర ప్రాంతం నుండి చేపట్టనున్న ఫుట్‌పాత్ పై వినూత్నంగా గ్రానైట్ రాళ్లతో ఏర్పాటు చేసే పనులను, టైల్స్ డిజైన్ అకృతులను కలెక్టర్ పరిశీలించారు. ఫుట్‌పాత్ నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు ఫుట్‌పాత్‌లు ప్రజలకు సౌకర్యవంతంగా, భద్రతతో ఉండేలా నిర్మించాలని, చిన్న పిల్లలు, వికలాంగులు, వృద్ధులు సైతం ఎలాంటి ఇబ్బంది లేకుండా నడిచే విధంగా పనులు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ నగర అభివృద్ధి అనేది కేవలం రోడ్లు, భవనాల నిర్మాణంతోనే కాకుండా ప్రజల రోజువారీ జీవితాన్ని సులభతరం చేసే మౌళిక వసతులతో ముడిపడి ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా ఫుట్‌పాత్‌లు నడక ద్వారా ప్రజల భద్రతకు, ఆరోగ్యానికి అత్యంత కీలకమని అన్నారు.విద్యార్థులు, ప్రజలు నడుచుకుంటూ వెళ్లే పరిస్థితులు, పిల్లలు, వృద్ధులు, వికలాంగులు ఎదుర్కొనే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఫుట్‌పాత్‌లు అత్యంత నాణ్యతతో, సౌకర్యవంతంగా నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. ఎక్కడా నాణ్యతలో రాజీ పడకుండా పనులు జరగాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.నగరంలో తొలిసారిగా వినూత్నంగా గ్రానైట్ రాళ్లతో ఫుట్‌పాత్‌లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. లైట్ గ్రే రంగులో గ్రానైట్ రాళ్లు ఉపయోగించడం వలన ఆకర్షణీయంగా ఉండటమే కాకుండా వర్షం, ఎండ వంటి వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా, దీర్ఘకాలికంగా నిలిచి ఉపయోగపడతాయని అన్నారు.దివ్యాంగులు, వృద్ధులు సులభంగా నడిచేలా స్లోప్‌లు, ఎడ్జ్‌లు సరిగ్గా రూపకల్పన చేయాలని, ప్రజలకు వెలుతురు వలన ఏలాంటి ఇబ్బందులు కలగకుండా, రాత్రి వేళ అసౌకర్యం లేకుండా లైటింగ్ పోల్స్ ఏర్పాటు చేయాలన్నారు. నగరం అంతా ఒకే విధమైన డిజైన్‌తో గ్రానైట్ ఫుట్‌పాత్‌లు ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నగరంలో ఫుట్‌పాత్‌ల అభివృద్ధి వల్ల ప్రజలు నడక వైపు మొగ్గు చూపుతారని, దీని ద్వారా శారీరక ఆరోగ్యం మెరుగుపడుతుందని, వాహనాలపై ఆధారపడకుండా నడకకు అనుకూలమైన మౌళిక వసతులు కల్పించడం ద్వారా కాలుష్యం కూడా తగ్గుతుందని కలెక్టర్ తెలిపారు. జరుగుతున్న నిర్మాణ అభివృద్ధి పనుల అమలులో ఎక్కడా నిర్లక్ష్యం చోటు చేసుకోకుండా పూర్తి బాధ్యతతో పర్యవేక్షణ చేస్తూ పనులు పూర్తిచేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎఈ యాకుబ్ అలీ, ఖమ్మం గ్రానైట్ యాజమాన్యాలు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ లో ప్రభుత్వ ఉపాధ్యాయులకు శిక్షణ



**జనవరి 31 (సీ కే న్యూస్) చేగుంట:**రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా వెల్లడించిన ఎలక్షన్లో భాగంగా శనివారం నాడు కలెక్టరెట్ లో చేగుంట నుండి ఉపాధ్యాయులకు
శిక్షణ, మెదక్ కలెక్టరేట్ లో నిర్వహించారు, ఈ కార్యక్రమంలో చేగుంట మండలంలోని పలు పాఠశాలల ఉపాధ్యాయులు ట్రైని మాస్టర్స్ ఉపాధ్యాయులు వెంకట్ రామ్ రెడ్డి, జగన్ లాల్,రాజి రెడ్డి,క్రిష్ణ మూర్తి,పూర్ణ చందర్,రాజాచారీ, సలోమి, కృష్ణవేణి,మంజులత, పర్జన పర్జన, వాణి, తదితరులు పాల్గొన్నారు

## త్రీ శక్తి ఆలయంలో కుంభాభిషేక మహోత్సవంలో భాగంగా 9వ రోజు.





**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు జనవరి 31.** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ శ్రీ హరిహర త్రిశక్తి క్షేత్రం 12 వ వార్షిక కుంభాభిషేక మహోత్సవాలలో భాగంగా 9వ రోజు శనివారం శనిత్రయోదశి పురస్సర సంపూర్ణ నవగ్రహ అభిషేకం, శని తైలాభిషేకం, సంపూర్ణ నవగ్రహ శాంతి హోమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవార్లను భక్తి శ్రద్ధలతో దర్శించుకున్నారు. అమ్మవార్లకు హారతి అనంతరం దేవాలయ నిర్వహకులు భక్తులందరికీ అన్నసంతర్పణ చేశారు. సాయంత్రం 5.30 నిమిషాలకు నృత్యాంజలి కూచిపూడి నాట్యాలయము ( శ్రీమతి అడప భరణి) బృందంచే నృత్యసేవ.

# ప్రత్యర్థులవి 'సొల్లు కబుర్లు'.. మావి చేతల పనులు!



- పదేళ్ల దొరల పాలనలో పేదలకు ఒరిగింది శూన్యం
- కమిషన్ల కక్కుర్తితో కట్టిన కాళేశ్వరం ఏమైందో చూడండి
- ఏదులాపురం ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ పార్టీ పై మంత్రి పొంగులేటి ఘాటు విమర్శలు

**సికె న్యూస్ ప్రతినిధి ఏదులాపురం మున్సిపాలిటీ :** "ఎన్నికలు రాగానే ప్రత్యర్థులు మీ ముందుకు వచ్చి 'సొల్లు కబుర్లు' చెబుతారు.. మాయమాటలతో మభ్యపెట్టే ప్రయత్నం చేస్తారు. కానీ, పదేళ్లు అధికారంలో ఉండి పేదవాడికి ఒక ఇల్లు కూడా ఇవ్వని వారు ఇప్పుడు ఏ మొహం పెట్టుకుని ఓట్లు అడుగుతారు?" అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి బీఆర్ఎస్ పార్టీ పై నిప్పులు చెరిగారు. శనివారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 3, 4, 5, 6, 25వ వార్డుల్లో ఆయన విస్తృతంగా పర్యటించి ఎన్నికల శంఖారావం పూరించారు.

అకౌంట్లు నింపుకోవడమే గత పాలకుల ధ్యేయం

ప్రచార సభల్లో మంత్రి పొంగులేటి పదేండ్ల బీఆర్ఎస్ పాలనపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "గత దొరల పాలనలో పేదలు అనేక ఇబ్బందులు పడ్డారు. ఆనాటి పాలకులు తమ అకౌంట్లు నింపుకోవాలని చూశారే తప్ప, సామాన్యుల సంక్షేమాన్ని గాలికొదిలేశారు. లక్షల కోట్ల ప్రజాధనాన్ని కుమ్మరించి, కేవలం కమిషన్ల కోసం కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు నేడు కళ్లముందే కూలిపోతోంది. ఇది వారి అవినీతికి నిదర్శనం కాదా?" అని ప్రశ్నించారు. రెండు సార్లు అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలను వంచించిన చరిత్ర వారిదని ఎద్దేవా చేశారు.

– చేతల ప్రభుత్వం.. ఇందిరమ్మ రాజ్యం

తాము అధికారంలోకి వచ్చిన కొద్ది కాలంలోనే మాటను నిలబెట్టుకున్నామని మంత్రి స్పష్టం చేశారు. "మేము మాటలు చెప్పేవాళ్లం కాదు.. పనిచేసే వాళ్లం. రాష్ట్రవ్యాప్తంగా రూ. 22,500 కోట్లతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టాం. అర్హులైన ప్రతి పేదవాడికి ఇళ్ల స్థలంతో పాటు రూ. 5 లక్షల సాయం అందిస్తాం" అని భరోసా ఇచ్చారు. ఉచిత బస్సు ప్రయాణం, ₹500లకే గ్యాస్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలు క్షేత్రస్థాయిలో అమలవుతున్నాయని, ఇవే తమ ప్రభుత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు.

ఏదులాపురానికి కొత్త హంగులు

ఏదులాపురం మున్సిపాలిటీని రాష్ట్రానికే రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతానని మంత్రి పునరుద్ఘాటించారు. "వచ్చే వర్షాకాలం నాటికి మున్నేరు రక్షణ గోడను పూర్తి చేసి ప్రజల కష్టాలు తీరుస్తాం. ఎఫ్.సి.ఐ గోడౌన్ తరలింపుతో పాటు ఇక్కడ అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తాం. మీ కష్టం తెలిసిన మీ పెద్ద కొడుకుగా నేను మీకు అండగా ఉంటా" అని హామీ ఇచ్చారు. విపక్షాల సొల్లు కబుర్లను నమ్మకుండా, అభివృద్ధిని కాంక్షిస్తూ హస్తం గుర్తుపై ఓటు వేసి కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు.

## ధర్మారెడ్డి పల్లి దగ్గర కాలువ పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్లు.

**సికే న్యూస్ దినపత్రికలో వచ్చిన వార్తకు స్పందించిన అధికారులకు కృతజ్ఞతలు.**

**బిజెపి పార్టీ జిల్లా నాయకులు కందుల తానేష్ గౌడ్.**



**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు జనవరి 31.** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం పరిధిలో ఉన్న ధర్మారెడ్డిపెల్లి దగ్గర కాలువ మరమ్మతులు కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించినారు. తూముషటార్లు పునరుద్ధరించి వ్యవసాయ భూములకు నీరు అందే విధంగా పనులు వేగవంతం చేయాలని అధికారులు కాంట్రాక్టర్లు ఇప్పటికైనా స్పందించి పనులు ప్రారంభించినందుకు వారికి రైతుల తరఫున ధన్యవాదాలు కందుల తానేష్ గౌడ్ మీడియా ద్వారా తెలిపినారు.

## ఫిబ్రవరి 12న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కరపత్రం ఆవిష్కరణ :-సీఐటీయూ.



**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు జనవరి 31.** కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్ ల రద్దుకై ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సమ్మెలో భవనిర్మాణ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని భవనిర్మాణ కార్మిక సంఘం వలిగొండ మండల కమిటీ ఆధ్వర్యంలో కరపత్రం విడుదల చేయడం జరిగింది.

శనివారం రోజున భవనిర్మాణ కార్మిక సంఘం వలిగొండ మండల కమిటీ సమావేశం మొగిలిపాక ఎల్ల స్వామి అధ్యక్షతన పట్టణ కేంద్రంలో నిర్వహించడం జరిగింది. ఈ సమావేశమునకు సిఐటి జిల్లా సహాయ కార్యదర్శి తుర్కపల్లి సురేందర్ భవనిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గొరిగె సో ములు ముఖ్య అతిథులుగా విచ్చేసి సమ్మె కరపత్రాన్ని విడుదల చేయడం జరిగింది.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ:-బీజేపీ ప్రభుత్వం 3వ సారి అధికారం లోకి వచ్చిన తరువాత బ్రిటిష్ కాలంలో పోరాడి తెచ్చుకున్న కార్మిక 29చట్టాలను రద్దు చేసి వాటి స్థానం లో పెట్టుబడి దారులు కు అనుకూలంగా 4లేబర్ కొడ్లను తీసుకొచ్చింది అని, ఈ కోడ్ ల వల్ల కార్మికులు తమ హక్కులు ను పూర్తి గా కొలిపోతున్నారు.ఈ కోడ్ ల అమ లఐతే కార్మికుల వేతనాలు చట్టం మరియు కనీస వేతనాలు చట్టం రద్దు అయితుందనిఆవేదన వ్యక్తం చేశారు. అందుకే కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కోడ్ ల రద్దుకై ఫిబ్రవరి 12 జరిగే దేశవ్యాప్త సమ్మెలో భవనిర్మాణ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని శ్రీ కార్మికుల్ని కోరారు

ఈ కార్యక్రమంలో భవనిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రాధారపు మల్లేశం, మల్గ బీరప్ప ఆరూరు నరసింహ నల్గా కుమార్ పోలపాక శంకర్ కం దుల శీను తిరుమలేశా చేకూరి నాగేష్ పద్మయ్య రామచంద్రం సింగారం వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

## యాప్ ద్వారానే యూరియా పంపిణీ.

**వ్యవసాయ అధికారి హరిప్రసాద్**

**జనవరి 31 ( సీ కే న్యూస్) చేగుంట**

తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం, వ్యవసాయ శాఖ సూచనల మేరకు రైతులు ఇకపై యూరియా ఎరువును నేరుగా దుకాణాలకు వెళ్లి కొనుగోలు చేయడం సాధ్యం కాదని యాప్ ద్వారానే బుకింగ్ చేసుకుని పొందాలని మండల వ్యవసాయ అధికారి హరిప్రసాద్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.యూరియా సరఫరా సక్రమంగా,పారదర్శకంగా ఉండేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన "ఫర్టిలైజర్ యాప్ " ద్వారా ముందుగా బుకింగ్ చేసుకున్న రైతులకు మాత్రమే యూరియా అందించబడుతుందని తెలిపారు.ప్రతి రైతు తప్పనిసరిగా మొబైల్ ఫోన్ ద్వారా యాప్‌లో నమోదు చేసుకుని,అవసరమైన యూరియా పరిమాణాన్ని ముందుగా బుక్ చేసుకోవాలి.బుకింగ్ నిర్ధారణ తర్వాత మాత్రమే సంబంధిత ఎరువు దుకాణంలో యూరియా అందుబాటులో ఉంటుందని తెలిపారు. రైతులు పై సూచనలను గమనించి,ముందస్తుగా యూరియా బుకింగ్ చేసుకుని ఇబ్బందులు లేకుండా ఎరువును పొందాల్సిందిగా సూచించారు.



## విద్యార్థులకు అల్పాహారం కోసం వితరణ



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**చింతకాని మండలం లచ్చగూడెం గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2025-2026 విద్యా సంవత్సరంలో పదవ తరగతి విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల కోసం సాయంత్రం ప్రత్యేక తరగతుల సమయంలో వారికీ కావలసిన అల్పాహారం కొరకు లచ్చగూడెం గ్రామ సర్పంచ్ కొప్పుల రజిని దయా హృదయంతో స్పందించి 8000/- వేలు రూపాయలను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ చదువుని ఇష్టంగా చదివి. పదవ తరగతిలో ఉత్తీర్ణ సాధించాలని గ్రామానికి పాఠశాలకి మంచి పేరు తీసుకురావాలని పేర్కొన్నారు.. ఈ కార్యక్రమంలో. పాఠశాల హెచ్ఎం సత్యనారాయణ, గ్రామ సెక్రెటరీ నరేష్,పాఠశాల ఉపాధ్యాయులు, మండల కిసాన్ సెల్ అధ్యక్షులు కొప్పుల గోవిందరావు , తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ ఆంజనేయ స్వామి వార్షికోత్సవ హోమాలు ప్రారంభం.



**సికే న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు జనవరి 31.** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ ఆరూరు గ్రామపంచాయతీ పరిధిలో అప్పరెడ్డిపల్లి గ్రామంలో శ్రీ ఆంజనేయ స్వామి వార్షికోత్సవం హోమా పూజలు జరిగినవి, ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు తుమ్మల ప్రభాకర్ రెడ్డి, తుమ్మల శ్రీనివాస్ తుమ్మలరవీందర్ రెడ్డి తుమ్మల కృపాకర్ రెడ్డి, తుమ్మల కరుణాకర్ రెడ్డి, , బండారు నరసింహారెడ్డి, వలిగొండ మండల ఓబీసీ సెల్ అధ్యక్షుడు చిలకమర్రి కనకాచారి, తుమ్మల నరసయ్య సేవాసమితి అధ్యక్షులు ఆవుల సత్యనారాయణ, కార్యదర్శి వెలిమినేటి సంతోష్ కుమార్, కొయ్యగూర మధు, పిసాటి వీరారెడ్డి ఆరూరు మాజీ సర్పంచులు జినుకల దానయ్య, పోలేపాక చెమ్మయ్య, సుక్క రామచంద్ర,మోదాల వెంకటేశం, కొడితాల లక్ష్మయ్య, మోదాల లింగయ్య , తదితరులు పాల్గొన్నారు, తేదీ, 1 - 2 - 2026 , ఆదివారం రోజున 12:00 గంటలకు శ్రీ సీతారాముల కల్యాణోత్సవం జరుగును కావున భక్తులుప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదాలు స్వీకరించవలసిందిగా కోరుచున్నాము,

# అభివృద్ధిలో ఆయన రూటే సపరేటు....


- 50 ఏళ్ల నాటి కల నెరవేర్చిన అపర భగీరథుడు..
- 7.కోట్లతో నేరడ (టు)ప్రొద్దుటూరు కు బీటీ రోడ్డు మంజూరు..
- బట్టి చిత్రపటానికి పాలభిషేకంతో కృతజ్ఞతలు తెలిపిన ప్రజలు ...



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** తెలంగాణ ఉపముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క చేసే ప్రతి అభివృద్ధి కార్యక్రమంలో ఆయన రూటే సపరేట్గా... ఉంటుందని జిల్లా కాంగ్రెస్ నాయకులు పెంట్యాల. పుల్లయ్య నేరడ గ్రామ సర్పంచ్ దూసరి. నేతాజీ, పొద్దుటూరు సర్పంచ్ మొగిలి కృష్ణ లు తెలిపారు. శనివారం తెలంగాణ ఉప ముఖ్యమంత్రి స్వరవతో నేరడ (టు) ప్రొద్దుటూరు గ్రామాలను అనుసంధానం చేస్తూ బీటీ రోడ్డు నిర్మించేందుకు సుమారు 7. కోట్ల రూపాయలు నిధులను మంజూరు చేయడం జరిగింది అన్నారు. ఈ శుభ సందర్భంలో నేరడ, ప్రొద్దుటూరు గ్రామాల ప్రజలు భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలుపుతూ ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 50 ఏళ్ల కాలం నుండి ఈ రెండు గ్రామాల ప్రజలు, రైతులు బీటీ రోడ్డు కోసం ఎదురు చూసి చూసి అలసిపోయారన్నారు. బట్టి విక్రమార్క ఈ రెండు గ్రామాల ప్రజలకు చిరకాల కోరికను నెరవేర్చి ఈ రెండు గ్రామాల ప్రజలకు అపర భగీరథుడు అయ్యాడని వారు తెలిపారు. పొద్దుటూరు నుంచి ఖమ్మం వెళ్ళాలి అంటే సుమారు30 కిలోమీటర్ల వ్యవధిలో చుట్టూ తిరిగి వెళ్లాల్సి వచ్చేదని, ఈ రోడ్డు నిర్మించడం వల్ల ప్రొద్దుటూరు నుంచి నేరడ లచ్చగూడెం, కోడుమూరు మీదగా కేవలం 20 కిలోమీటర్ల దూరంలోనే అతి తొందరలో ఖమ్మం పట్టణానికి సులువుగా వెళ్ళొచ్చని, ఈ రెండు గ్రామాల ప్రజలు వారి యొక్క సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఎంతోమంది పాలకులు వచ్చారు కానీ ఎవరూ కూడా రోడ్డు నిర్మించలేకపోయారని గత పాలకులు అయితే శంకుస్థాపనలు చేసి మసిబూసి మారేడు కాయ చేశారు తప్ప నిధులు కేటాయించలేదని వారు తెలిపారు. బట్టి విక్రమార్క లాంటి నాయకుడు మధిర నియోజకవర్గం తెలంగాణ రాష్ట్రానికే అపర భగీరథుడిగా మేము భావిస్తున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రానికి ఉపముఖ్య మంత్రి అయిన దగ్గర నుండి మదన నియోజవర్గానికి వేలకోట్లతో నిధులు వర్షం కురిపించి అభివృద్ధికి బాటలు వేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నేరడ గ్రామ ఉపసర్పంచ్ కోటా. బాలేష్, ప్రొద్దుటూరు మాజీ సర్పంచ్ తుడుం. రాజేష్, నేరడ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంకెన. నాగేశ్వరరావు, పెంట్యాల పెంట్యాల నాగుల మీరా, తుళ్లూరి అచ్చయ్య, కోటా నగేష్ పెరిక.నందు కొల్లి సతీష్ మాజీ ఎంపిటిసి పెరిక. గోవిందరావు చెవుల తిరుపతిరావు షేక్ సుభాని తదితరులు పాల్గొన్నారు

# చింతకాని మండలంలో అంతర్గత రోడ్ల నిర్మాణానికి 54 కోట్ల రూపాయల భారీ నిధుల మంజూరు..

- ప్రజల అభివృద్ధికి మరో కీలక అడుగు.
- భట్టి విక్రమార్క కి చింతకాని మండల ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు..



| | | | | |
|---|---|---|---|---|
| 23 | Mudigonda | BT to R/F Medepalli to Gokinepalli | 3.00 | 500.00 |
| 24 | Yerrupalem | BT to R/F Tellapalem to Jamalapuram Remidicherla PR Road | 2.80 | 420.00 |
| 25 | Chinthakani | BT on R/F Nagilgonda to Tutikuntla | 3.40 | 525.00 |
| 26 | Mudigonda | BT Road and C/D HLB on R/F Pandregupally to Bonakal Road | 2.00 | 3000.00 |
| 27 | Yerrupalem | BT on R/F Gosaveedu to Ramakrishnapuram | 1.75 | 280.00 |
| 28 | Chinthakani | BT on R/F Nerada to Lachagudem Stadium | 3.00 | 550.00 |
| 29 | Yerrupalem | BT to R/F Ramapuram to Kothapalem | 3.30 | 615.00 |
| 30 | Chinthakani | Chinthakani Vandanam R&B road to Lachagudem Nereda PR Road | 1.00 | 175.00 |
| 31 | Yerrupalem | BT to R/F Rajupalem to Morusumalli thanda | 4.75 | 900.00 |
| 32 | Chinthakani | Lachagudem to Anantharam | 4.50 | 700.00 |
| 33 | Chinthakani | Chinnamandava to Nagulavancha Choppakatlapalem PR Road | 4.00 | 700.00 |
| | | Total:- | 84.65 | 17360.00 |





**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** చింతకాని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అంబటి వెంకటేశ్వరరావు అభ్యర్థన మేరకు,చింతకాని మండలంలోని 10 గ్రామీణ లింకు రోడ్ల నిర్మాణానికి తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు భట్టి విక్రమార్క గారు, 54 కోట్ల రూపాయల మరియు రాంపురం - పాతర్లపాడు ఇంటర్నేషనల్ రెసిడెన్షియల్ స్కూల్ రోడ్డు: 2.60 కోట్లు , మొత్తం 56 కోట్ల 60 లక్షల రూపాయలు నిధులను మంజూరు చేయడం జరిగింది.

గ్రామాల / రోడ్ల వారిగా నిధుల లిస్ట్.

చింతకాని మండలం:

ఖమ్మం–బోనకల్ =ఒదీ రోడ్డు టు మత్కెపల్లి -- పందిళ్ళపల్లి (న్యూ మార్కెట్) : ?4.50 కోట్లు

2.నాగులవంచరైల్వే కాలనీ =ఒదీ రోడ్డు టు అండర్ పాస్ : 5.00 కోట్లు మరియు రాంపురం - పాతర్లపాడు ఇంటర్నేషనల్ రెసిడెన్షియల్ స్కూల్ రోడ్డు: 2.60 కోట్లు

3.పందిళ్ళపల్లి (అంజనాపురం) -- అనంతసాగర్ : 4.00 కోట్లు

4.కొమట్లగూడెం -- రెడ్డిగూడెం : 7.00 కోట్లు

5.ప్రొద్దుటూరు -- నేరడ : 7.00 కోట్లు

6.నాగులీగొండ టు తూటికుంట్ల : 5.25 కోట్లు

7.నేరెడ టు లచ్చగూడెం స్టేడియం: 5.50 కోట్లు

8.వందనం =ఒదీ -- లచ్చగూడెం–నేరడ్రా= రోడ్ : 1.75 కోట్లు

9.లచ్చగూడెం -- అనంతారం : 7.00 కోట్లు

10.చిన్నమండవ టు నాగులవంచ--చొప్పకట్లపాలెం: 7.00 కోట్లు

ఈ రోడ్డు నిధులు మంజూరు చేసినందుకు తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కి మండల ప్రజల తరఫున

హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసిన చింతకాని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఒ మత్కేపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు

# చదువే భవితకు బంగారు బాట

- ప్రతి చిన్నారి చదువుకోవాలి
- బాలల హక్కుల పరిరక్షణకు నిరంతర పోరాటం
- అవగాహన సదస్సులో ఐ.ఎన్.హెచ్.ఆర్.పి.సి బాధ్యులు

**జనవరి (31) సి కె న్యూస్ అబ్దుల్లా ఉస్మాన్ నారాయణఖేడ్ జిల్లా సంగారెడ్డి.** చదువే భవితకే బంగారు బాట వేస్తుందని,ప్రతి చిన్నారి చదువుకోవాలని ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఓంప్రకాష్,జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.ఏ.ఖైసర్ అన్నారు.శనివారం వీధి బాలల దినోత్సవం సందర్భంగా నారాయణఖేడ్ పట్టణంలోని విజ్ఞాన్ టాలెంట్ స్కూల్లో విద్యార్థుల హక్కులపై అవగాహన సదస్సును నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ..విద్య బాలల హక్కు అని, విద్యతోనే పిల్లల జీవితాలలో వెలుగులు నిండుతాయని,చదువే సమాజాన్ని సరైన దిశలో నడిపించే శక్తి అని పేర్కొన్నారు. బాలలపై ఎలాంటి వివక్ష,బాల కార్మిక వ్యవస్థ ఉండకూడదని, పిల్లలకు విద్య, ఆరోగ్యం,భద్రత వంటి హక్కులు తప్పనిసరిగా కల్పించాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు.బాలల హక్కుల పరిరక్షణ కోసం ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం గైనికాడి సురేష్ గౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





# జిల్లా వ్యాప్తంగా ఆపరేషన్ స్మైల్-XII లో భాగంగా 58 మంది బాల కార్మికులకు విముక్తి.




ఎస్పీ రోహిత్ రాజు.

**సీ కే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జనవరి 31,** బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడంలో భాగంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆపరేషన్ స్మైల్–శ×× లో భాగంగా 01.01.2026 నుండి 31.01.2026 వరకు జిల్లా వ్యాప్తంగా 05 ప్రత్యేక బృందాల ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ పరిశ్రమలు, వ్యాపార సముదాయాలలో దాడులు నిర్వహించడం జరిగిందని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు శనివారం ఒక ప్రకటనను విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం ఐదు బృందాలను ఈ దాడులను నిర్వహించడానికి ఏర్పాటు చేయడం జరిగిందని, నెల రోజుల పాటు జరిగిన ఈ దాడులలో భాగంగా మొత్తం 58 మంది బాలకార్మికులను పట్టుకొని వారికి విముక్తి కలిగించడం జరిగిందని తెలిపారు. ఇందులో 09 మంది బాలికలు ఉండగా 49 మంది బాలురు ఉన్నారు.ఇందులో ఇతర రాష్ట్రాలకు చెందిన 04 బాలికలు, 27 మంది బాలురలను గుర్తించినట్లు తెలిపారు.బాలబాలికలను పనిలో పెట్టుకున్న యాజమానులపై కేసులు నమోదు చేశామన్నారు.జిల్లాలో మొత్తం 36 కేసులు నమోదు చేయడం జరిగిందని తెలిపారు.ఆపరేషన్ స్మైల్ –శ×× బృందం పట్టుకున్న వారిని గుర్తించి వారి తల్లిదండ్రుల కు సురక్షితంగా అప్పగించడం జరిగిందని తెలియజేసారు. అనంతరం పిల్లల తల్లి దండ్రులకు కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగిందని వెల్లడించారు.జిల్లాలో ఎక్కడైనా బాలకార్మికులు కనబడితే వెంటనే డయల్ 100 నకు గానీ 1098కి గానీ ఫోన్ చేసి పోలీస్ వారికి సమాచారం ఇవ్వగలరని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఆపరేషన్ స్మైల్ –శ×× నకు డీసిఆర్బీ డిఎస్పీ మల్లయ్య స్వామి నోడల్ అధికారిగా వ్యవహరించారు.ఆపరేషన్ స్మైల్ బృందంలో పనిచేసి బాలకార్మికులకు విముక్తి కలిగేలా బాధ్యతలు నిర్వర్తించిన షీటీం ఇన్స్పెక్టర్ రాము,ఆరెఎస్సై రమాదేవి,ఎస్సైలు విజయ, సతీష్, శ్రావణ్, రాఘవయ్య, సమ్మిరెడ్డి, లక్ష్మణ్, ఏఎస్సై నాగయ్య, పీసీలు మల్లికాంబ, రాంబాబులను ఈ సందర్భంగా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# లిటిల్ స్కాలర్స్ గ్రామర్ పాఠశాలలో ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

**పెబ్బేరు జనవరి31 (సి కే న్యూస్)** పెబ్బేరు మండల కేంద్రంలోని లిటిల్ స్కాలర్స్ గ్రామర్ పాఠశాలలో శనివారం విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు చెప్పడంతో పాటు, కలెక్టర్,డీఈవో,ఎంఈవో, పాఠశాల ప్రిన్సిపాల్,ప్రధానోపాధ్యాయురాలు,పాఠశాల డైరెక్టర్ లుగా పాఠశాలకు రావడం పలువురిని ఆకట్టుకుంది. విద్యార్థులే ఉపాధ్యాయులుగా చక్కటి పాఠశాలను బోధించారు. కలెక్టర్గా నందిని, డీఈవోగా వైష్ణవి,ఎంఈవోగా రోహిణి పాఠశాలను సందర్శించి పరిశీలించడం, తనిఖీలు చేయడం ఆకట్టుకుంది. అలాగే పాఠశాల ప్రిన్సిపాల్ గా స్రవంతితో పాటు ప్రధానోపాధ్యాయురాలుగా వర్షిత,పాఠశాల డైరెక్టర్ గా శివాంగి,ఉపాధ్యాయులుగా ఇతర విద్యార్థులు వ్యవహరించారు.పాఠశాల ప్రిన్సిపాల్



ప్రభావతి,ప్రధానోపాధ్యాయులు రామస్వామి విద్యార్థులను అభినందించారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాఠశాల ప్రధాన సలహాదారులు వెంకటయ్య మరియు ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# పదవీ విరమణ పొందుతున్న జిఎంకు ఆత్మీయ సన్మానం



**సి కే న్యూస్** పదవీ విరమణ పొందుతున్న సంధర్భముగా సింగరేణి సంస్థ జనరల్ మేనేజర్ (ఫైనాన్స్) ఎం.సుబ్బారావును శనివారము సింగరేణి ప్రధాన కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్ నందు ఐడపిఎం డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో డైరక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వి.సూర్యనారాయణ, డైరక్టర్(పిడపి) కే.వెంకటేశ్వర్లు మరియు డైరక్టర్ (ఈడఎం) ఎం.తిరుమల రావు, జనరల్ మేనేజర్ (ఫైనాన్స్) ఎం.సుబ్బారావును ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ... సుమారు 37 సంవత్సరాల సుధీర్ఘ

సర్వీసులో ఎం.సుబ్బారావు సింగరేణి సంస్థలో పలు పదవుల్లో వారు క్రమ శిక్షణ తో, అంకిత భావముతో విధులు నిర్వహించి స్నేహపూర్వకంగా అందరి మన్ననలు పొందారని, ఫైనాన్స్ విభాగంలో తనదైన శైలిలో ప్రత్యేక గుర్తింపు

తీసుకువచ్చారని తెలుపుతూ వారు చేసిన సేవలను గుర్తు చేస్తూ కొనియాడారు. పదవీ విరమణ అనంతరం వారి శేషజీవితం ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో గడపాలని అన్నారు.ఈ కార్యక్రమములో డైరక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వి.సూర్యనారాయణ, డైరక్టర్(పిడపి) కే.వెంకటేశ్వర్లు మరియు డైరక్టర్ (ఈడఎం) ఎం.తిరుమల రావుతో పాటు జిఎం(సిపిపి) ఏ.మనోహర్, జిఎం(క్వాలిటి) ఏ.రవి కుమార్, జిఎం(సేఫ్టీ) కే. సాయిబాబు, జిఎం(పర్సనల్) ఐఆర్డపిఎం కవితా నాయుడు, జిఎం(పర్సనల్) వెల్ఫేర్ ఒ సిఎస్ఆర్ జి.వి.కిరణ్ కుమార్, జిఎం(పర్సనల్) ఈఈ ఒ ఆర్సి ఏ.జి.ఎం.మురళీధర రావు, జిఎం(ఎంఎస్) బొజ్జ రవి, జిఎం(సిహెచ్పి) పి.ఎలిషా, జిఎం(సివిల్) డి.వెంకటేశ్వర్లు, జిఎం(ఐడపిఎం) సిహెచ్.శ్రీహరి, జిఎం(ట్రాన్స్పోర్ట్) ఎం.రామనాథం, జిఎం(ఈడఎం) పి.మురళీ కృష్ణ, జిఎం(స్టోర్స్) కే.ప్రసాద రావు, జిఎం(పిడపి) జి.దేవేందర్, జిఎం(సోలార్) బి.సీతారామం, హెచ్ఓడి(విజిలెన్స్) పి.రాజీవ్ కుమార్, ఇతర జిఎం లు, అధికారులు పాల్గొన్నారు.

## సాఫ్ట్‌వేర్ నుంచి ఏఐ సొల్యూషన్ల వైపు మారుతున్న భారతీయ ఐటీ పరిశ్రమ



భారత ఐటీ రంగం సాంప్రదాయ సాఫ్ట్‌వేర్ అభివృద్ధి నుంచి వేగంగా కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారిత సొల్యూషన్ల వైపు పయనిస్తోందని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. దశాబ్దాలుగా మన ఐటీ పరిశ్రమకు ఉన్న బలాన్ని, పాత సాఫ్ట్‌వేర్ అభివృద్ధి మోడల్‌కు బదులుగా, ఏఐ సొల్యూషన్స్ అందించేలా ఉపయోగిస్తున్నామని అన్నారు. శుక్రవారం ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడిన ఆయన.. భారత్ ఇప్పటికే ఏఐ సంబంధిత రంగంలో 70 బిలియన్ డాలర్ల(రూ. 6.44 లక్షల కోట్ల) పెట్టుబడులను సాధించింది. వచ్చే నెలలో జరిగే ఇండియా–ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో ఇది రెట్టింపు కావొచ్చని వెల్లడించారు. ఈ సమ్మిట్ ప్రపంచంలోనే నాల్గవ, అతిపెద్ద ఏఐ సదస్సు. భారత్ తన ఏఐ ఎకోసిస్టమ్‌ను సరైన క్రమంలో అభివృద్ధి చేసిందని, దీని ద్వారా ప్రపంచ ఏఐ అభివృద్ధిలో దేశాన్ని కీలకంగా మార్చిందని పేర్కొన్నారు. ఐటీ కంపెనీలు ఇప్పుడు ఉద్యోగులకు కొత్త స్కిల్స్ కోసం శిక్షణ ఇస్తున్నాయని, క్లయింట్లతో తిరిగి సంబంధాలు ఏర్పరచుకుంటున్నాయని, కొత్త మార్కెట్ అవకాశాలను అన్వేషిస్తున్నాయని మంత్రి అన్నారు. ఇప్పటికే 5,00,000 మందికి పైగా విద్యార్థులు ఏఐ స్కిల్స్‌ను అందిపుచ్చుకున్నారు. త్వరలో 500 విశ్వవిద్యాలయాలలో ఏఐ మౌలిక సదుపాయాలు, కోర్సు పాఠ్యాంశాలను అందిస్తామని, తద్వారా విద్యార్థులు ఏఐ అవకాశాలపై మెరుగైన శిక్షణ పొందవచ్చని పేర్కొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ షాక్ ?




కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు ఎదురుచూస్తున్న కరువు భత్యం (ఆం)పై వారికి షాక్ తప్పేలా లేదు. ఈసారి కరువు భత్యం పెంపు విషయంలో కేంద్ర ప్రభుత్వం పిసినారిగా వ్యవహరించబోతున్నట్లు తెలుస్తోంది. 8వ వేతన సంఘం సిఫార్సుల కోసం ఎదురుచూస్తున్న కేంద్ర ఉద్యోగులకు ఈసారి కరువు భత్యం ఊరటనిస్తుందని భావించగా.. అలాంటిదేమీ లేదని తేలిపోతోంది. ఈ మేరకు కేంద్రం డీఏ పెంపును ఖరారు చేసినట్లు సమాచారం. ఈసారి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల డీఏ కనిష్టంగా 2 శాతం, గరిష్టంగా 5 శాతం ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇందులో 2 శాతం పెరిగితే ప్రస్తుతం ఉన్న మూలవేతనం(బేసిక్ పే) లో 58 శాతం నుంచి 60 శాతానికి పెరిగే ఛాన్స్ ఉంది. గరిష్టంగా 5 శాతం పెరిగినా అత్యధికంగా 63 శాతానికి మాత్రమే ఇది చేరనుంది. ఎందుకంటే కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ డిసెంబర్ 2025కి ప్రకటించిన అఖిల భారత వినియోగదారుల ధరల సూచీని 148.2 వద్దే ఉంచింది. ద్రవ్యోల్బణం ప్రభావం నుండి జీతాలు, పెన్షన్లను కాపాడటానికి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు కరువు భత్యం ఎప్పటికప్పుడు సవరిస్తారు. అయితే ఈ సవరణకు ప్రాతిపదికగా పారిశ్రామిక కార్మికుల కోసం అఖిల భారత వినియోగదారుల ధరల సూచీని తీసుకుంటారు. కానీ తాజాగా ప్రకటించిన సూచీని ఎలాంటి మార్పులు లేకుండా అలాగే ఉంచడంతో కరువు భత్యం గరిష్టంగా 5 శాతం పెరిగి 63 శాతానికి చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు. గతంలో కేంద్ర ప్రభుత్వం జూలై 2025లో 54 శాతంగా ఉన్న డీఏను 58 శాతానికి పెంచింది. ఇప్పుడు డీఏను ఖరారు చేసినా మార్చి లేదా ఏప్రిల్ లో కేంద్రం ఆమోదం తర్వాతే ఇది అమల్లోకి వస్తుంది. అయితే బకాయిలు మాత్రం చెల్లిస్తారు.

## ద్రవ్యలోటు రూ.8.55 లక్షల కోట్లు



దేశ ద్రవ్యలోటు 2025 డిసెంబరు చివరకు రూ.8.55 లక్షల కోట్లుగా నమోదైంది. 2025–26 ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యలోటు, జీడీపీలో 4.4% లేదా రూ.15.69 లక్షల కోట్లుగా ఉండొచ్చని కేంద్రం అంచనా వేసింది. ఈ అంచనాల్లో తాజా గణాంకాలు 54.5 శాతానికి సమానం. 2024–25 ఇదే సమయంలో ద్రవ్యలోటు బడ్జెట్ లక్ష్యంలో 56.7 శాతంగా ఉంది. ప్రభుత్వ ఆదాయ, వ్యయాల వ్యత్యాసాన్ని ద్రవ్యలోటుగా పరిగణిస్తారు. కంట్రోలర్ జనరల్ ఆఫ్ అకౌంట్స్ (సీజీఏ) గణాంకాల ప్రకారం.. డిసెంబరు చివరకు ప్రభుత్వానికి రూ.25.25 లక్షల కోట్ల ఆదాయం వచ్చింది. బడ్జెట్ అంచనాల్లో ఈ మొత్తం 72.2 శాతానికి సమానం. ఇందులో రూ.19.39 లక్షల కోట్లు పన్నుల రూపేణ, రూ.5.39 లక్షల కోట్లు పన్నేతర ఆదాయంగా లభించింది. రుణ రహిత పెట్టుబడి సాధనాల్లో రూ.46,047 కోట్లు సమకూరాయి. ఏప్రిల్– డిసెంబరు నెలల్లో పన్ను ఆదాయంలో వాటా రూపేణ రాష్ట్రాలకు రూ.10.38 లక్షల కోట్లు బదిలీ చేశారు. 2024–25 ఇదే కాలంలో బదిలీ చేసిన మొత్తం కంటే ఇది రూ.1.37 లక్షల కోట్లు అధికం. ఏప్రిల్–డిసెంబరులో మొత్తం ప్రభుత్వ వ్యయాలు రూ.33.8 లక్షల కోట్లకు చేరాయి. బడ్జెట్ అంచనాల్లో ఇవి 66.7 శాతానికి సమానం. ఇందులో రూ.25.93 లక్షల కోట్లు రెవెన్యూ వ్యయాలు కాగా.. రూ.7.87 లక్షల కోట్లు పెట్టుబడి వ్యయాలు. రెవెన్యూ వ్యయాల్లో రూ.9.11 లక్షల కోట్లు వడ్డీ చెల్లింపులకు, రూ.3.17 లక్షల కోట్లు ప్రధాన రాయితీలకు వెచ్చించారు.

## రష్యన్ క్రూడ్‌పై రిలయన్స్ భారీ డీల్ ఫిబ్రవరి నుంచి పోటెత్తనున్న దిగుమతులు

ప్రముఖ భారతీయ పారిశ్రామిక దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్, రష్యా నుంచి భారీ మొత్తంలో ముడి చమురును దిగుమతి చేసుకునేందుకు సిద్ధమైంది. రానున్న ఫిబ్రవరి నెల నుంచి ప్రతిరోజూ సుమారు 1.5 లక్షల బ్యారెళ్ల చమురును కొనుగోలు చేయాలని కంపెనీ నిర్ణయించుకున్నట్లు అంతర్జాతీయ వార్తా సంస్థ రాయిటర్స్ వెల్లడించింది. అంతర్జాతీయ మార్కెట్‌లో మారుతున్న పరిణామాలు, దేశీయ ఇంధన అవసరాల దృష్ట్యా రిలయన్స్ ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఒప్పందం ద్వారా భారత ఇంధన రంగంలో రిలయన్స్ తన పట్టును మరింత బలోపేతం చేసుకోనుంది. అమెరికా విధించిన ఆంక్షల పరిధిలోకి రాని రష్యన్ చమురు సంస్థలతోనే ఈ లావాదేవీలు జరగనున్నట్లు సమాచారం. రాబోయే రెండు నెలల పాటు ఈ కొనుగోలు ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతుందని కంపెనీ ప్రతినిధులు భావిస్తున్నారు. అంతర్జాతీయ నియమ నిబంధనలను పాటిస్తూనే, తక్కువ ధరకే లభించే రష్యా క్రూడ్‌ను అందిపుచ్చుకోవాలని రిలయన్స్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. దీనివల్ల కంపెనీకి ఉత్పత్తి వ్యయం తగ్గడమే కాకుండా, లాభదాయకత కూడా పెరిగే అవకాశం ఉంది. గత డిసెంబర్ నెలలో కూడా రిలయన్స్ సంస్థ అమెరికా ఆంక్షల నుంచి ప్రత్యేక మినహాయింపులు పొంది రష్యా నుంచి చమురును దిగుమతి చేసుకుంది. ఆ సమయంలో కుదుర్చుకున్న ఒప్పందాలు విజయవంతం కావడంతో, ఇప్పుడు మరింత పెద్ద మొత్తంలో ఆర్డర్లు ఇచ్చేందుకు కంపెనీ మొగ్గు చూపుతోంది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ, దౌత్యపరమైన వెసులుబాటును ఉపయోగించుకుంటూ రిలయన్స్ తన దిగుమతులను కొనసాగిస్తోంది.

# సమానత్వం, ప్రేమ భావనలను చాటుతున్న గురు రవిదాస్ బోధనలు


ప్రతి ఏట మాఘ పూర్ణిమ రోజు "గురు రవిదాస్ జయంతి"ని భారతదేశవ్యాప్తంగా అత్యంత గౌరవప్రదంగా నిర్వహించుకోవడం ఆనవాయితీగా మారింది. అతి ప్రధానమైన భారత సాధువుల్లో ఒకరైన గురు రవిదాస్ భక్తి ఉద్యమాలు, ఆధ్యాత్మిక బోధనలు, కరుణతో నిండిన జీవితం, వివక్షలేని సమాజం, సామాజిక సమానత్వ పోరాటాలు, కుల వ్యవస్థను సవాలు చేయడం లాంటి అంశాలు నేటి పౌర సమాజంపై చెరగని ముద్రను వేసాయి. దేవుడి ఏకత్వ బోధనలు, ఆధ్యాత్మిక స్వచ్ఛత ప్రోత్సాహాలు నేటికీ ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి, భవిష్యత్తులో కాలాతీత సందేశాలుగా ఉంటాయి కూడా. గురు రవిదాస్ జీవనయానం వినయం, భక్తి, కరళత అనే ఇతివృత్తాలతో ముడిపడి ఉన్నది. 15వ శతాబ్దంలో తక్కువ కుల (తోలు కార్మిక) కుటుంబంలో జన్మించిన గురు రవిదాస్, సాధువుగా మారి సమానత్వం సాధనకు కృషి చేసిన ఆధ్యాత్మిక నాయకుడుగా మనకు తెలుసు. పుట్టుక, కులం, మతం పేర్లతో పౌర సమాజ విభజనలు వ్యతిరేకించిన రవిదాస్ కుటుంబం చెప్పులు కుట్టే పనిలో గడిపేవారు. ఆయన బోధనలు విన్న పండితులు, రారాజులు సహితం ఆయనకు ఎనలేని గౌరవాన్ని ఇచ్చేవారు. గురు రవిదాస్ తన భక్తి గీతాలతో ప్రసిద్ధి పొందారు. అనేకమైన ఈ గీతాలు సిక్కుల మత గ్రంథమైన "గురు గ్రంథ్ సాహిబ్"లో చేర్చబడ్డాయి. ఆయన కీర్తనలు మతపరమైన సరిహద్దులను దాటి సమానత్వ సాధనకు ఉపకరించాయి. ప్రేమ, ఐక్యత, సమానత్వం అనబడే సందేశాలు నేటికీ లక్షలాది ప్రజలకు ప్రేరణగా నిలుస్తున్నాయి. సకల జీవుల్లో దేవుడు ఉన్నాడని, దైవం ముందు పెద్ద చిన్న కులాలు లేవని ప్రచారం చేసాడు. గురు రవిదాస్ బోధనలు అణగారిన వర్గాలకు గౌరవప్రదమైన జీవితంపై ఆశలు, బలాన్ని అందించాయి. బాహ్య ఆచారాల కంటే భక్తి ఆధారంగా దైవంతో సంబంధం పెట్టుకోవచ్చని వివరించాడు. విగ్రహారాధనను వ్యతిరేకిస్తూ, నిరాకార దేవుని ఏకత్వ భావనను ప్రచారం చేసాడు. గురు రవిదాస్ జయంతి రోజు ఆధ్యాత్మిక చింతన, ఆనంద పూజలు, సమాజ వేడుకలు, నాగర్ కీర్తనలు (ఊరేగింపులు), స్తోత్రాల పఠనం, లంగర్ భోజనాలు, దాతృత్వ కార్యక్రమాలు లాంటివని పెద్ద ఎత్తున జరుపుకుంటారు. "మీ హృదయం స్వచ్ఛంగా ఉంటే, ఒక చిన్న కుండ నీరు కూడా పవిత్ర గంగా నదిలా పవిత్రం అవుతుంది" అనే ఒక ప్రసిద్ధ సామెతను గురు రవిదాస్ అందించాడు. అంతర్గత స్వచ్ఛతే ఆధ్యాత్మికత, శాంతికి అదే నిజమైన మార్గం అని నొక్కి వక్కాణించిన గురువు మన రవిదాస్. కులమతాలు, సామాజిక వివక్షలకు అతీతంగా ప్రతి ఒక్కరిలో దైవంతో అనుసంధానమయ్యే సామర్థ్యం ఉంటుందని బోధించాడు. గురు రవిదాస్ బోధనలు నేటికీ సందర్భోచితంగా ఉంటూ, అసమానతలు, వివక్షత, సామాజిక అన్యాయాలు వంటి సమస్యలను పరిష్కరించడానికి ఒక నైతిక చట్రంగా నిలుస్తున్నాయి. సమాజ ఐక్యత, కరుణ వ్యాప్తి, నిస్వార్థ సేవాగుణాలను ఆచరిస్తూ గురు రవిదాస్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించుకుందాం.

# ఆసియా తొలి మహిళ వ్యోమగామి కల్పనా చావ్లా

కల్పనాచావ్లా.. భారతదేశ గర్వించదగ్గ వ్యోమగామి. ప్రపంచ వ్యాప్తం గాఎందరికో స్ఫూర్తిగా నిలిచిన మహిళ. అంతరిక్షయానం చేసిన తొలి భారతీయ, అంతేకాక ఇండో–అమెరికన్ మహిళ వ్యోమగామి కల్పనా చావ్లా. పట్టుదల, కృషి, అంకితభావం ఉంటే సాధించ లేనిది ఏదీ ఉండదని ఆమె నిరూపిం చారు. ఎందరో యువతులకు స్ఫూర్తి ప్రదాతగా నిలిచారు. కల్పనా చావ్లా, భారత దేశం లో హర్యానా లోని కర్నాల్ అనే ఊరులో సంప్రదాయ శాఖాహార ఒక పంజాబీ కుటుంబం లో మార్చి17, 1962 లో పుట్టారు. తండ్రి బనారసీ లాల్ చావ్లా. సోదరుడు సంజయ్ చావ్లా కమర్షియల్ పైలట్ కావాలని కలలు కనేవాడు. తన గదిలో విమా నాల బొమ్మలుంచేవాడు. అవి కల్ప నలో స్ఫూర్తిని రగిలించాయి. కల్ప నా చావ్లా ముందుగా, కర్నాల్ లో ఉన్న టాగోర్ పబ్లిక్ స్కూల్లో చదువుకున్నారు. పంజాబ్ ఇంజినీరింగ్ కాలేజీలో ఏరోనాటికల్ ఇంజినీరింగ్ డిగ్రీ పూర్తి చేసిన కల్పనా చావ్లా ఎంఎస్ కోసం 1982లో అమెరికాకు వలస వెళ్లారు. 1982 లో ఈమె అమెరికా వెళ్లి అక్కడ "ఏరోస్పేస్ ఇంజనీరిం గ్"లో మాస్టర్ అఫ్ సైన్సు డిగ్రీని, అర్లింగ్టన్‌లో ఉన్న టెక్సాస్ విశ్వ విద్యాలయం నుంచి 1984 లో పొందారు. 1986లో, చావ్లా రెండవ మాస్టర్ అఫ్ సైన్సు డిగ్రీని మరియు ఏరోస్పేస్ ఇంజనీరింగ్‌లో పిహెచ్డి ని బౌల్డర్‌లో ఉన్న కోలోరాడో విశ్వ విద్యాలయం నుంచి పొందారు. ఆమె 1983 లో విమానయాన శిక్షకుడు మరియు విమాన చోదక శాస్త్ర రచయిత ఐన జీన్–పియర్ హారిసన్ ను వివాహం చేసుకున్నారు. భారత దేశంలో మొట్టమొదటి విమానాన్ని నడిపిన జె.ఆర్.డి. టాటా యే తనకు స్ఫూర్తి, అందుకనే ఏరోనాటిక్స్ ఇంజనీరింగ్ ను కెరీర్ గా తీసుకున్నానని చెపుతుండేవారు. లింగ వివక్షతను అధిగమించి తల్లి సహకారంతో ఆమె తన కలలను సాకారం చేసుకున్నారు. కల్పన అంటే ఆలోచన లేదా ఊహా. చిన్న నాటి నుంచే ఆకాశంలో విహరిం చాలనే కోరికతో కల్పన తన పేరును సార్థకం చేసుకున్నారు. టెక్సాస్ యూనివర్సిటీలో మాస్టర్స్ డిగ్రీ పూర్తయిన తర్వాత, 1988లో కొలరాడో యూనివర్సిటీ నుంచి ఏరోస్పేస్ ఇంజినీరింగ్‌లో పీహెచ్ పట్టాను స్వీకరించారు. 1988లో అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసాకు చెందిన ఏమ్స్ రిసెర్చ్ సెంటర్లో ఉద్యోగంలో చేరారు. ఏడాది నాసా పరిశోధన కేంద్రంలో చేరిన కల్పన పవర్ లిఫ్ట్ కాంప్యూటే షనల్ ఫ్లూయిడ్ డైనమిక్స్ విభాగంలో వైస్–ప్రెసిడెంట్‌గానూ బాధ్యతలు నిర్వర్తించారు. ఆ తర్వాత నాసాకు వైస్–ప్రెసిడెంట్‌గా సేవలు అందించారు. 1991లో ఆమెకు అమెరికా పౌరసత్వం లభించింది. తొలిసారిగా 1997లో కొలంబియా నౌక ద్వారా అంతరిక్ష యానం చేసిన కల్పనా చావ్లా చరిత్ర సృష్టించారు. అంతరిక్షంలో 376 గంటలు గడిపి భూమిచుట్టూ 252 సార్లు పరిభ్రమించి 6.5 మైళ్లు తిరిగారు. అంతరిక్షయానం చేసిన తొలి భారతీయ మహిళగానే కాదు, తొలి ఆసియా మహిళగానూ కల్పన రికార్డులకెక్కారు. తన మొదటి స్పేస్ మిషన్‌లో భాగంగా కొలంబి యా ఎస్‌టీఎస్–87 అంతరిక్ష నౌకలో ప్రయాణించే టప్పుడు ఆమెఅప్పటి భారత ప్రధాని ఐకే గుజ్రాల్‌తో మాట్లాడారు. ఆ సమయంలో అంతరిక్షం నుంచి తీసిన హిమాల యాల ఫోటోలను గుజ్రాల్‌కు చూపించారు. 2003 జనవరిలో రెండోసారి అంతరిక్షంలోకి వెళ్లి 16 రోజులు గడిపి 80 ప్రయోగాలను విజయ వంతంగా నిర్వహించారు. భారత మూలాలు ఉన్న కల్పన 40 ఏళ్ల వయసులో, 2003లో చని పోయారు. 2003 ఫిబ్రవరి 1 న అంతరిక్షం నుంచి తిరిగివస్తూ ఆమె ప్రయాణిస్తున్న అంతరిక్ష నౌక భూమి వాతావరణం లోకి ప్రవేశిస్తు న్నప్పుడు ప్రమాదం జరిగింది. ఆ ప్రమాదంలో కల్పనతో పాటు ఆమె తో కలిసి ప్రయాణిస్తున్న మరో ఆరుగురు సిబ్బంది కూడా మరణిం చారు. కొలంబియా అంతరిక్ష నౌక షెడ్యూల్ ల్యాండింగ్‌కు 16 నిమిషాల ముందు అమెరికాలోని టెక్సాస్ ప్రాంతంలో కూలిపోయింది. ఆమె గౌరవార్థం తమిళనాడు ప్రభుత్వం కల్పనా చావ్లా పురస్కా రాన్ని 2003 నుంచి ఏటా ప్రకటిస్తోం ది. దీన్ని వివిధ రంగాల్లో 15 మంది శక్తివంతమైన మహిళకు అంద జేస్తుంది. కల్పన గౌరవార్థం దేశం లోని ఎన్నో విద్యాసంస్థలకు, అవార్డులకు ఆమె పేరు పెట్టారు. యువ మహిళా శాస్త్రవేత్తలను ప్రోత్సహించేందుకు కర్ణాటక ప్రభు త్వం 2004లో కల్పనా చావ్లా అవార్డును ఏర్పాటు చేసింది. భార తీయ అంతరిక్ష పరిశోధన కేంద్రం 2003లో ప్రయోగించిన మెట్ శాట్‌కు కల్పనా చావ్లా పేరు పెట్టారు. తండ్రి బనారసీలాల్ చావ్లా సాధారణ వ్యాపారి. కల్పనపై ఆయన ప్రభావం ఎక్కువ. పేదరికం నుంచే ఆయన పైకెదిగీ, పట్టుదల, అందుకు తగిన కృషి ఉంటే సాధించలేనిది ఏదీ లేదని నిరూపించిన వ్యక్తి ఆయన. చిన్నగా టైర్ల వ్యాపారాన్ని ప్రారంభించిన ఆయన తొలుత ఎన్నో కష్టనష్టాలకు గురయ్యారు. అయినా దాన్ని వదలకుండా అనుకున్నది సాధించేందుకు ముందుకు సాగిపోయారు. అప్పటి వరకూ టైర్ల తయారీకి విదేశీ యంత్రాన్ని ఉపయోగించేవారు. ఆ క్రమంలో ఆయన దేశీయంగానే ఆ యంత్రా న్ని రూపొందించారు. బనారసీలాల్ శ్రమ ఫలించింది. రాష్ట్రపతి నుంచీ అభినందనలు అందుకున్నారు. తర్వాత డబ్బుకోసం బనారసీ కుటుంబం ఇబ్బంది పడింది లేదు. ఆడపిల్లే అయినా జీవితంలో ఏదో సాధించాలన్న తపన కల్పనలో పాదుకోవడానికి తండ్రేకారణం. "పరిస్థితులు ఎలాగున్నా... కన్న కలల్ని నిజం చేసుకోవడమే అంతిమ లక్ష్యం అన్న మాటలు నా తండ్రి జీవితంలో నిజమయ్యాయి. ఫలితంగా అవే నాలోనూ జీర్ణించుకు పోయాయి. అందుకు నాన్నే కారణం." అంటూ తొలి అంతరిక్షయానం తర్వాత ఇచ్చిన ఇంటర్వ్యూలో తన ఆలోచనలు ఏ విధంగా ప్రభావితమయిందీ కల్పన వివరించారు. ఏదో ఒకటి చేయండి, కానీ దాన్ని మీరు మనఃస్ఫూర్తిగా చేయాలను కోవాలి. ఎందుకంటె ఏదైనా పనిని కేవలం ఒక లక్ష్యం కోసం చేయడం కాక,... దానిలో లీనమై అనుభవిం చాలి" అని యువతులకు సందేశం ఇచ్చేవారు.

# ఉచితాలు ఎత్తేస్తారా? ఆర్థిక సర్వేలో కేంద్రం ఏం చెప్పింది?

ఉచిత పథకాలపై ఆర్థిక సర్వేలో అంచనాలు ఎలాంటి టార్గెట్లు లేకుండా క్యాష్ ట్రాన్స్‌ఫర్లు సరికాదు ఆర్థిక వ్యవస్థ గాడి తప్పే ప్రమాదముంటుందన్న సర్వేఇఇఃనీనినీఎతిఇః ాబీతీలవఎ: దేశంలో ఉచిత పథకాలకు సంబంధించి కేంద్ర ఎకనామిక్ సర్వేలో సంచలన విషయాలు వెలుగుచూశాయి. కేంద్రం పార్లమెంట్ లో ప్రవేశ పెట్టిన ఎకనామిక్ సర్వేలో ఉచిత పథకాలు, ఎలాంటి టార్గెట్లు లేకుండా క్యాష్ ట్రాన్స్ ఫర్లు చేయడం లాంటి పథకాల వల్ల ఆర్థిక వ్యవస్థ గాడి తప్పే ప్రమాదం ఉందని అంచనా వేసింది. ఇలాంటి పథకాల కంటే కూడా బ్రెజిల్, మెక్సికో, ఫిలిప్పీన్స్ లో ఉన్న పథకాలను అమలు చేస్తే బెటర్ అని అభిప్రాయపడింది. దేశంలో ఈ మధ్య కాలంలో ఓటర్లను ఆకట్టుకోవడానికి పొలిటికల్ పార్టీలు ఇబ్బడిముబ్బడిగా వరాలు ప్రకటిస్తున్నాయి. ఆడవారికి 10వేలు ఇస్తాం. రైతులకు ఇవి ఇస్తాం.. చేనేతలకు అది ఇస్తాం.. పిల్లలకు ఇంకోటి ఇస్తాం.. నిరుద్యోగులకు ఫలానాది ఇస్తాం. ఇలా నోటికి వచ్చినట్టు హామీలు గుప్పిస్తున్నాయి. ఏ రాష్ట్రం కూడా వీటికి అతీతం కాదు. ఏపీ, తెలంగాణ, తమిళనాడు, బీహార్, మహారాష్ట్ర, కర్ణాటక, అసోం, పశ్చిమ బెంగాల్.. ఇలా ఒకటేంటి ప్రతి రాష్ట్రం కూడా ఇలాంటి ఉచిత హామీల విషయంలో తగ్గేదేలే అన్నట్టుగా ఉన్నాయి. దేశంలో ఉచిత హామీలు, మనీ ట్రాన్స్ ఫర్లు ఏ రేంజ్ లో పెరిగిందంటే 2023 నుంచి 2026 నాటికి అది ఐదింతలు పెరిగింది. ప్రస్తుతం దేశ ఆర్థిక బడ్జెట్ మీద 1.7 లక్షల కోట్లు ఈ ఉచితాలు, మనీ ట్రాన్స్ ఫర్ల రూపంలో ప్రజలకు అందుతున్నాయి. ఏడు రాష్ట్రాల్లో నెలవారీ వచ్చే ఆదాయంలో 87 శాతం కేవలం ఈ ఉచితాలకు ఇవ్వడానికే సరిపోతుందంటే పరిస్థితి ఏం స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఆర్థిక సర్వేతో పాటు ఇతర ప్రభుత్వ సర్వేలు, అంచనాలను గమనిస్తే ఈ ఉచిత పథకాలు, డబ్బులు ట్రాన్స్ ఫర్ల వల్ల పెద్దగా ఒరిగిందేమీ లేదు. ఆ స్థాయిలో పురోగతి కూడా సాధించలేదు. మహిళలకు గానీ, ఇతరులకు గానీ ఇస్తున్న ఉచిత హామీల డబ్బుల వల్ల పెద్దగా వారి జీవితాలో మార్పులు తీసుకురాలేకపోయాయని సర్వేలు చెబుతున్నాయి. వాళ్లకు డబ్బులిస్తే ఏదో మంచి జరిగి వాళ్ల జీవితాలు మారతాయని ఆశించిన ఫలితం దక్కలేదు. మరోవైపు రాష్ట్రాల ఖజానాల మీద ఆర్థిక భారం తడిసి



మోపెడవుతోంది. దీని వల్ల ఆర్థిక లోటు పెరుగుతోంది. జనాల చేతిలో డబ్బుల పెడుతున్నప్పుడు, ఉచితాల రూపంలో కాకుండా ఏదో ఒక టార్గెట్ ఓరియంటెడ్ గా ఉండాలని ఆర్థిక సర్వే అభిప్రాయపడింది. అంటే, ఫర్ ఎగ్జాంపుల్ మీ పిల్లలు స్కూలుకి వస్తేనే డబ్బులిస్తామని అంటే వాళ్లు స్కూలుకు వచ్చినప్పుడు వాళ్ల అటెండెన్స్ పూర్తిగా, ప్రాపర్ గా చెక్ చేసి వాళ్ల అకౌంట్లో డబ్బులు వేయడం. ఇది ఓ రకంగా బెటర్. ఎందుకంటే పిల్లలు చదువుకుంటారు. మెల్లగా వృద్ధిలోకి వస్తారు. ఇంకో ఎగ్జాంపుల్ ఏంటంటే, గర్భిణులు ప్రాపర్ గా చెకప్స్ చేయించుకోవడం, పిల్లలకు కచ్చితంగా వ్యాక్సిన్లు వేయించడం.. ఇలాంటి వాటికి మనీ ట్రాన్స్ ఫర్ చేస్తే ఆరోగ్య పరంగా దేశం బాగుపడుతుంది. మనిషి ఆరోగ్యంగా ఉంటే సగం సమస్యలు లేనట్టే. ఎందుకంటే ఇండియా లాంటి దేశంలో ఒక్క చిన్న జబ్బు వచ్చినా ఆస్పత్రుల్లో ఖర్చుల సంగతి తెలిసిందే. జీవితాంతం కష్టపడి సంపాదించిన సొమ్ము ఒక్కసారి ఆస్పత్రి పాలవుతుంది. కాబట్టి హెల్త్ లాంటి అంశాలపై ఉచితాలు, మనీ ట్రాన్స్ ఫర్లు చేస్తే బెటర్ అనే అభిప్రాయం ఎకనామిక్ సర్వే వెలిబుచ్చింది. ఉచితాలు, కండిషనల్ మనీ ట్రాన్స్ ఫర్ల లాంటి అంశాల్లో ఎలా పడితే అలా ఇచ్చేయకుండా బ్రెజిల్ ను ఫాలో అయితే బెటర్ అనే అభిప్రాయాన్ని ఎకనామిక్ సర్వే అభిప్రాయపడింది. బ్రెజిల్లో 2003లో బోల్సా ఫెమిలియా అనే స్కీమ్ తెచ్చారు. అక్కడ విద్య, వైద్యం (పైన చెప్పిన ఎగ్జాంపుల్స్) అంశాల్లో లబ్దిదారులకు బ్యాంకు అకౌంట్లకు మనీ ట్రాన్స్ ఫర్ చేస్తున్నారు.

ఇది సత్ఫలితాలు ఇచ్చింది. ఈ రకంగా చేయడం వల్ల ఒకదశకు వచ్చాక ఆ విద్యార్థి చదువుకుని గ్రాడ్యుయేట్ అయ్యాక డబ్బులు ఇవ్వాల్సిన పనిలేదు. అలాగే, స్త్రీలకు కూడా ఆ టార్గెట్ పూర్తయ్యాక డబ్బులు ఇవ్వాల్సిన అవసరం ఉండదు. అలా కాకుండా 'ఫలానా కులం వారికి డబ్బులు ఇస్తాం.' అని ఎన్నికల హామీలు ఇస్తే వాళ్లకు జీవితాంతం ఇస్తూ పోవాలి. అలాగే, మెక్సికో, ఫిలిప్పీన్స్ లో కూడా ఇలాంటి కండిషన్ల మీదే మనీ ట్రాన్స్ ఫర్ పథకాలు ఉన్నాయి. దీని వల్ల అకౌంటబిలిటీ పెరుగుతుంది. అలాగే, సరైన దిశలోనే ప్రజల సొమ్ము ఖర్చువుతుంది. మొత్తానికి ఉచితాలు, డబ్బుల పంపిణీలు అనేవి కొన్ని కండిషన్ల ద్వారా జరగాలని ఎకనామిక్ సర్వే కచ్చితంగా అభిప్రాయపడింది. అలాగే, టైమ్ కండిషన్లు కూడా పెట్టుకోవాలని సూచించింది. లేకపోతే ఆర్థికంగా దెబ్బతింటామని స్పష్టం చేసింది.

# మెంతి కూర పవర్ తెలిస్తే వదలరు



ఎన్నో ఔషధ గుణాలు ఉన్న మెంతి ఆకు.. అనేక ఆరోగ్య సమస్యలను నివారించడంలో కీలకపాత్ర పోషిస్తుంది. కాలేయ సమస్యలు, మధుమేహం నియంత్రణ, చర్మ వ్యాధుల నివారణకు తోడ్పడుతుంది. కాల్షియం, ఐరన్, ఫాస్ఫరస్, ప్రోటీన్లు, ఫైబర్ సమృద్ధిగా ఉండే ఈ ఆకు, జ్ఞాపకశక్తిని పెంచి, క్యాన్సర్ వంటి వ్యాధులను నిరోధించగలదు. మెంతి కూరలో ఎన్నో పోషకాలతో పాటు.. ఔషధ గుణాలు పుష్కలంగా దాగున్నాయి.. మన భారతీయ వంటకాల్లో సర్వసాధారణంగా ఉపయోగించే ఒక అద్భుతమైన ఆకుకూర. ఇది కేవలం రుచిని పెంచడమే కాకుండా, అనేక ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉంది. దీనిని మెంతి లేదా మెంతి కూర అని కూడా పిలుస్తారు. రుచికి చేదుగా ఉన్నప్పటికీ, ఈ ఆకు అనేక పోషక విలువలను, అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉంది. సాధారణంగా మెంతి ఆకులో చిన్న మెంతెం, పెద్ద మెంతెం అని రెండు రకాలుంటాయి. ఈ ఆకు శరీరానికి సంబంధించిన అనేక ఆరోగ్య సమస్యలను తగ్గించడంలో ఎంతగానో సహాయపడుతుంది. మెంతి ఆకులో కాల్షియం, ఇనుము, ఫాస్ఫరస్‌లతో పాటు ప్రోటీన్లు అధికంగా ఉంటాయి. అంతేకాకుండా, ఫైబర్ పుష్కలంగా లభిస్తుంది. ఈ పోషకాలు శరీరానికి బలాన్ని చేకూర్చి, వివిధ వ్యాధుల నుండి రక్షణ కల్పిస్తాయి. లివర్ ఆరోగ్యం, డయాబెటిస్ నియంత్రణ: మెంతి ఆకు ముఖ్యంగా కాలేయ సమస్యలను తగ్గించడంలో తోడ్పడుతుంది. మధుమేహం ఉన్నవారికి ఇది చాలా మేలు చేస్తుంది. రక్తంలో షుగర్ స్థాయిలను అదుపులో ఉంచడానికి సహాయపడుతుంది. చర్మ సంరక్షణ: చర్మ ఇన్ఫెక్షన్లు రాకుండా కాపాడుతుంది. దీనిలో ఉండే యాంటీఆక్సిడెంట్లు చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. జీర్ణక్రియ, ఇతర సమస్యలు: మెంతి ఆకు ఆకలిని పెంచుతుంది. దగ్గు, మొలలు, వాంతులు, కీళ్ల వ్యాధులు వంటి అనేక సాధారణ వ్యాధులను నివారిస్తుంది. కడుపులోని నులిపురుగులకు ఇది మంచి ఔషధంగా పనిచేస్తుంది. అయితే, పప్పు దినుసులలో దీనిని అతిగా వేయకూడదు.. లేదంటే పప్పు చేదుగా మారుతుంది. రక్తహీనత నివారణ: ఇందులో ఐరన్ పుష్కలంగా ఉండటం వల్ల రక్తహీనతను దూరం చేయడంలో సమర్థవంతంగా పనిచేస్తుంది. కంటిచూపు మెరుగుదల: మెంతికూరలో అధికంగా ఉండే ఫైబర్ కంటిచూపును మెరుగుపరుస్తుంది. దృష్టి లోపాలు ఉన్నవారు ఈ ఆకును తమ ఆహారంలో ఎక్కువగా చేర్చుకోవడం మంచిది. శరీర ఉష్ణోగ్రత నియంత్రణ: శరీర ఉష్ణోగ్రత అధికంగా ఉండేవాళ్లు మెంతికూరను తీసుకోవచ్చు. ఇది శరీరానికి చలువనిస్తుంది.. వేడి వలన వచ్చే అలర్జీలను దూరం చేస్తుంది. కఫం, పిత్త, వాతం వంటి రోగాలను దరిచేరనివ్వకుండా చేస్తుంది. జ్ఞాపకశక్తి మెరుగుదల, క్యాన్సర్ నిరోధం: మెంతి ఆకు జ్ఞాపకశక్తిని పెంచుతుంది. ఇందులో ఉండే సఫోన్ మ్యూకలేట్ ధాతువులు క్యాన్సర్‌ను నిరోధించడంలో సహాయపడతాయి. హృదయ ఆరోగ్యం, ఇతర ప్రయోజనాలు: విటమిన్ ఎ సమృద్ధిగా ఉండటం వల్ల గుండెపోటు, అలర్జీలు, దృష్టి లోపాలు, రక్తహీనత వంటి వాటిని తొలగిస్తుంది. నరాల బలహీనతతో బాధపడేవారు కూడా మెంతి కూరను తమ ఆహారంలో భాగంగా చేసుకోవచ్చు. ఇంకా.. మెంతి ఆకులను పేస్ట్‌లా చేసి ఫేషియల్‌గా ఉపయోగించవచ్చు. ఇది నల్లగా ఉన్నవారికి చర్మకాంతిని పెంచి, ముఖంపై నల్ల మచ్చలు, ముడతలను తగ్గిస్తుంది. మెంతులను నానబెట్టి పేస్ట్‌లా చేసి జుట్టుకు అప్లై చేయడం వల్ల జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది. మెంతి ఆకుతో లేదా మెంతులతో చేసే పప్పు ఆరోగ్యానికి మంచి పౌష్టికాహారం. మెంతి ఆకును ఎండబెట్టి పొడి చేసుకొని, అవసరమైనప్పుడు పప్పులు, కూరలలో వాడుకోవచ్చు. ఇది ఆరోగ్యానికి ఎంతగానో మేలు చేస్తుంది. మన ఇంటి పెరడులో కూడా మెంతి ఆకును సులువుగా పెంచుకోవచ్చు.. వారానికి కనీసం రెండు లేదా మూడుసార్లు మెంతులు లేదా మెంతి ఆకును ఆహారంలో చేర్చుకోవడం వలన అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. ఇది కేవలం ఒక ఆకుకూర మాత్రమే కాదు.. సంపూర్ణ ఆరోగ్యాన్ని ప్రసాదించే ఒక దివ్య ఔషధం అంటున్నారు ఆయుర్వేద నిపుణులు.

# నిమ్మకాయ నీటిలో ఈ ఒక్క పదార్థం కలిపి తాగండి చాలు!



మలబద్ధకం ఈ రోజుల్లో చాలామందిని ఇబ్బంది పెడుతున్న సాధారణ సమస్య. అనియమిత ఆహారపు అలవాట్లు, తక్కువ ఫైబర్ తీసుకోవడం, నీరు సరిపడా తాగకపోవడం, ఒత్తిడి వంటి కారణాల వల్ల ఈ సమస్య వస్తోంది. అయితే సహజంగా, ఇంట్లోనే సులభంగా మలబద్ధకాన్ని తగ్గించుకునే ఒక మార్గం ఉందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఆరోగ్యంగా ఉండాలంటే మనం తిన్న ఆహారం సంపూర్ణంగా జీర్ణమై విసర్జించబడాలి. లేదంటే అనేక వ్యాధుల బారినపడాల్సి వస్తుంది. మారుతున్న జీవనశైలిలో భాగంగా ఎవరూ కూడా సమయానికి భోజనం చేయడం లేదు. దీంతో తిన్నది జీర్ణం కావడం లేదు. ఈ క్రమంలో చాలా మంది మలబద్దకం సమస్యను ఎదుర్కొంటున్నారు. మలబద్దకం అనేది మన దైనందన జీవితాన్ని చాలా ఇబ్బంది పెట్టడమే గాక.. అనేక అనారోగ్య సమస్యలకు కారణమవుతుంది. అయితే, ఈ విషయాన్ని చాలా మంది బయటకు చెప్పుకోలేక బాధపడే వాళ్లూ ఉన్నారు. అయితే సహజంగా, ఇంట్లోనే సులభంగా మలబద్ధకాన్ని తగ్గించుకునే ఒక మార్గం ఉందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. నిమ్మకాయ నీటికి ఇదొక్కటి కలపండి.. మలబద్దకాన్ని నివారించేందుకు చాలా మంది నిమ్మకాయ నీరు తాగుతుంటారు. అయితే, ఇందులో ఒక పదార్థం చేర్చడం వల్ల మలబద్దకం సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. నిమ్మకాయ నీరు పేగులను హైడ్రేట్ చేయడంతోపాటు సిట్రిక్ యాసిడ్‌ను విడుదల చేసే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. అయితే, మీరు తాగే నిమ్మకాయ నీటిలో కేవలం ఒక స్పూన్ చియా గింజలను కలిపి 10 నిమిషాలు నానబెట్టి తీసుకోవడం వల్ల అదనపు ప్రయోజనాలు కలుగుతాయి. చియా గింజలను నిమ్మకాయ నీటికి జోడించడం వల్ల పేగులకు, ఆరోగ్యానికి ఎన్నో ప్రయోజనాలున్నాయి. చియా గింజలతో నిమ్మకాయ నీరు కలిపి తాగితే.. చియా గింజల్లో కరిగే ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. అందుకే నానబెట్టినప్పుడు అవి గుజ్జు లాంటి పదార్థంగా మారుతాయి. ఫుడ్ సైన్ అండ్ న్యూట్రిషన్ అధ్యయనం ప్రకారం.. ఆ గుజ్జు జీర్ణ వ్యవస్థ పనితీరును మెరుగుపరుస్తుంది. ఉదయం మలబద్దకం నుంచి ఉపశమనాన్ని అందిస్తుంది. జీర్ణవ్యవస్థ శుభ్రపర్చడం ద్వారా మలబద్దకాన్ని నివారిస్తుంది. చియా గింజలలో ఒమేగా3 (ఆల్ఫా-లినోలెనిక్ ఆమ్లం), నిమ్మకాయ నీటితో కలిపితే ట్రైగ్లిజరైడ్స్, ఎల్డీఎల్ కొలెస్ట్రాల్, వాపును తగ్గించడంలో సహాయపడుతుంది. మంచి కొలెస్ట్రాల్ ఊఆఒ స్థాయిలను పెంచుతుంది. రెండు కలిపి తీసుకోవడం వల్ల లిపిడ్ స్థాయిలను మెరుగుపర్చి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. దీంతో గుండె జబ్బులు ప్రమాదాన్ని తగ్గిస్తాయి. చియా గింజల్లో లభించే ఫైబర్, నిమ్మకాయ నీటితో కలిపితే కార్బోహైడ్రేట్ల శోషణను నెమ్మదిస్తుంది. ఇది గ్లూకోజ్ స్థాయిలను నియంత్రిస్తుంది. ఇన్సులిన్ సున్నితత్వాన్ని పెంచుతుంది.

# బరువు తగ్గాలనుకుంటే ఆ పని మాత్రం అస్సలు చేయద్దు!



బరువు తగ్గడం అనేది ఒక తపస్సు లాంటిది. ఈ క్రమంలో ప్రతి ఒక్కరూ తమకు తోచిన చిట్కాలు పాటిస్తుంటారు. అందులో అత్యంత ప్రజాదరణ పొందిన పద్ధతి 'బ్రేక్‌ఫాస్ట్ స్కిప్పింగ్'. ఉదయం పూట కడుపు ఖాళీగా ఉంచితే ఒంట్లో ఉన్న కొవ్వు కరిగిపోతుందని చాలామంది గట్టిగా నమ్ముతారు. కానీ ఇది ఎంతవరకు నిజం? అసలు ఉదయం పూట శరీరానికి అందాల్సిన ఇంధనం అందకపోతే మన అవయవాలు ఎలా స్పందిస్తాయి? పొద్దున్నే టిఫిన్ మానేయడం వల్ల మీరు నిజంగా సన్నబడతారా లేక లేనిపోని రోగాలను కొని తెచ్చుకుంటున్నారా? జపాన్ నుంచి అమెరికా వరకు జరిగిన అనేక పరిశోధనలు ఈ విషయంలో సంచలన విషయాలను వెల్లడించాయి. బరువు తగ్గడం పక్కన పెడితే.. ఈ అలవాటు వల్ల మీ మెదడు పనితీరు కూడా మందగించే ప్రమాదం ఉంది. అవును.. వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా ఇది నిజం. చాలా సందర్భాల్లో బ్రేక్‌ఫాస్ట్ మానేయడం వల్ల బరువు తగ్గకపోగా.. మరింత పెరిగే అవకాశం ఉందని పరిశోధనలు చెబుతున్నాయి. పొద్దున్నే ఏమీ తినకపోవడం వల్ల మధ్యాహ్నం సమయానికి కడుపులో ఆకలి సెగలు పుడుతుంటాయి. ఈ తీవ్రమైన ఆకలి వల్ల మధ్యాహ్నం భోజనంలో మనకు తెలియకుండానే ఎక్కువ క్యాలరీలు ఉన్న ఆహారాన్ని, జంక్ ఫుడ్‌ను ఆరగిస్తాం. ఉదయం ఆహారం తీసుకోకపోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు ఒక్కసారిగా పడిపోతాయి. ఆ తర్వాత మధ్యాహ్నం భారీ భోజనం చేయడం వల్ల ఇన్సులిన్ అకస్మాత్తుగా పెరుగుతుంది. ఈ హెచ్చుతగ్గులు శరీరంలో కొవ్వు నిల్వలు పెరగడానికి ప్రధాన కారణమవుతాయి. రాత్రంతా నిద్రపోయిన తర్వాత మన శరీరానికి శక్తి అవసరం. అది అందకపోతే శరీరం 'సర్వైవల్ మోడ్'లోకి వెళ్తుంది. అంటే శక్తిని ఆదా చేయడం కోసం మెటబాలిజం రేటును తగ్గించేస్తుంది. ఫలితంగా మీరు ఎంత తక్కువ తిన్నా సరే క్యాలరీలు త్వరగా ఖర్చు అవ్వవు. కేవలం 'ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్' (16/8 పద్ధతి) పాటించే వారు మాత్రమే బ్రేక్‌ఫాస్ట్ మానేసి బరువు తగ్గే అవకాశం ఉంది. అంటే ఉదయం టిఫిన్ మానేసి, కేవలం మధ్యాహ్నం నుంచి రాత్రి ఎనిమిది గంటల లోపు మాత్రమే భోజనం చేస్తూ, రోజంతా తీసుకునే మొత్తం క్యాలరీలను కచ్చితంగా లెక్కిస్తే ఫలితం ఉంటుంది. అయితే ఇది అందరికీ సరిపడదు. ముఖ్యంగా గ్యాస్ట్రిక్ సమస్యలు ఉన్నవారు, షుగర్ వ్యాధిగ్రస్తులు ఇలా చేయడం వల్ల తీవ్ర అనారోగ్య పాలయ్యే ప్రమాదం ఉంది. బ్రేక్‌ఫాస్ట్ అంటేనే రాత్రంతా మనం ఉన్న ఉపవాసాన్ని విరమించడం అని అర్థం. ఉదయం పూట పోషక విలువలూ ఉన్న ఆహారం తీసుకోవడం వల్ల కలిగే లాభాలు చాలా ఉన్నాయి. ఉదయం గ్లూకోజ్ అందడం వల్ల ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతాయి. ఆఫీసులో లేదా చదువులో చురుగ్గా ఉండవచ్చు. సరైన ప్రోటీన్ ఉండే టిఫిన్ తీసుకుంటే రోజంతా నీరసం రాకుండా ఉంటుంది. క్రమం తప్పకుండా బ్రేక్‌ఫాస్ట్ చేసేవారిలో కొలెస్ట్రాల్, రక్తపోటు అదుపులో ఉంటాయని అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి.

## ఈ సమయంలో అరటిపండు అస్సలు తినొద్దా



చలికాలం వచ్చిందంటే చాలు, పిల్లల ఆరోగ్యం విషయంలో తల్లులకు ఒకటే ఆందోళన. మారుతున్న వాతావరణం వల్ల పిల్లలు త్వరగా జలుబు, దగ్గు బారిన పడుతుంటారు. ఈ క్రమంలో తల్లులు పిల్లలకు దూరంగా పెట్టే ప్రధానమైన ఆహారం అరటిపండు. అరటిపండు తింటే కఫం పెరుగుతుందని, దగ్గు ఎక్కువవుతుందని చాలామంది నమ్ముతారు. చలికాలం వచ్చిందంటే చాలు.. చిన్న పిల్లల తల్లులకు ఒకటే ఆందోళన. మారుతున్న వాతావరణం వల్ల పిల్లలు త్వరగా జలుబు, దగ్గు బారిన పడుతుంటారు. ఇలాంటప్పుడు వారి ఆహారం విషయంలో ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటారు. ఈ క్రమంలో తల్లులు పిల్లలకు దూరంగా పెట్టే ప్రధానమైన ఆహారం అరటిపండు. అరటిపండు తింటే శ్లేష్మం పెరుగుతుందని, దగ్గు ఎక్కువవుతుందని చాలామంది నమ్ముతారు. కానీ ఇందులో నిజమెంత? చలికాలంలో అరటిపండు పెట్టడం సురక్షితమేనా? నిజానికి జలుబు లేదా దగ్గు అనేవి వైరస్ల ద్వారా వచ్చే ఇన్ఫెక్షన్లు. ఏ పండు కూడా నేరుగా జలుబును కలిగించదు. అరటిపండు తినడం వల్ల శరీరంలో శ్లేష్మం పెరుగుతుందని నిరూపించడానికి ఎటువంటి శాస్త్రీయ ఆధారాలు లేవు. అరటిపండు తిన్నప్పుడు గొంతులో కొంచెం బిగుతుగా అనిపించడం సహజం. అది కేవలం ఆ పండు ఆకృతి వల్ల కలిగే అనుభూతి మాత్రమే తప్ప కఫం కాదు. పిల్లలు జలుబు, దగ్గుతో బాధపడుతున్నప్పుడు నీరసించి పోతుంటారు. ఏమీ తినడానికి ఇష్టపడరు. అలాంటి సమయంలో అరటిపండు వారికి ఒక వరంలా పనిచేస్తుంది. ఇందులో కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉండటం వల్ల పిల్లలకు తక్షణ శక్తిని ఇస్తుంది. అరటిపండు మెత్తగా ఉండటం వల్ల గొంతు నొప్పి ఉన్న పిల్లలు కూడా దీనిని సులభంగా తినగలరు. ఇందులోని విటమిన్ సి, విటమిన్ ః6 రోగనిరోధక శక్తిని పెంచి వైరస్‌తో పోరాడటానికి సహాయపడతాయి. శరీరంలోని ఖనిజ లవణాల సమతుల్యతను కాపాడుతుంది.

పిల్లలకు అరటిపండు పెట్టినప్పుడు ఒకవేళ విరేచనాలు అవుతుంటే మాత్రం తాత్కాలికంగా ఆపేయడం మంచిది. చలికాలంలో ఏ ఆహారమైనా మితంగా ఇవ్వాలి. రోజుకు ఒకటి లేదా సగం అరటిపండును మ్యాష్ చేసి ఇవ్వడం వల్ల ఎటువంటి ఇబ్బంది ఉండదు. ఫ్రిజ్‌లో పెట్టిన అరటిపండ్లను నేరుగా పిల్లలకు ఇవ్వకండి. గది ఉష్ణోగ్రత వద్ద ఉన్న పండ్లను మాత్రమే ఇవ్వండి. అరటిపండు ప్రకృతి మనకిచ్చిన ఒక అద్భుతమైన సూపర్ ఫుడ్. అనవసరమైన అపోహలతో పిల్లలకు ఈ పోషకాలను దూరం చేయకండి. జలుబు చేసినప్పుడు ఆకలిగా లేని పిల్లలకు అరటిపండు ఒక మంచి ప్రత్యామ్నాయం.

## అనాస పువ్వు.. పవర్ ఫుల్ మెడిసిన్..!



అనాస పువ్వు (స్టార్ పువ్వు) వంటలకు రుచినివ్వడమే కాకుండా, అద్భుత ఆరోగ్య ప్రయోజనాల నిస్తుంది. ఇది జీర్ణశక్తిని మెరుగుపరుస్తుంది, మలబద్ధకాన్ని నివారిస్తుంది. యాంటీవైరల్, యాంటీబ్యాక్టీరియల్ లక్షణాలతో రోగనిరోధక శక్తిని పెంచి, గుండె ఆరోగ్యాన్ని కాపాడుతుంది. రక్తంలో షుగర్ స్థాయిలను నియంత్రిస్తుంది. పీరియడ్స్ సమస్యలు, చర్మ సౌందర్యానికి కూడా మేలు చేస్తుంది. అనాస పువ్వు .. ఇది ఒకరకమైన సుగంధ ద్రవ్యం.. ప్రతి వంటింట్లోనూ తప్పనిసరిగా ఉంటుంది. దీనినే స్టార్ పువ్వు అని కూడా అంటారు. ఇది వంటలకు రుచిని ఇవ్వడంతో పాటు అనేక ఆరోగ్య ప్రయోజనాలనూ అందిస్తుంది. ముఖ్యంగా మనం తీసుకున్న ఆహారాన్ని జీర్ణం చేయడంలో సహాయపడుతుంది. పేగు కండరాల కదలికలను మెరుగుపరుస్తుంది. మలబద్ధకం సమస్యను దరిచేరకుండా చేస్తుంది. అనాస పువ్వులో యాంటీవైరల్, యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్ లక్షణాలు ఎక్కువగా ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచి అనేక రకాల ఇన్ఫెక్షన్ల నుంచి కాపాడతాయి. జీర్ణశక్తిని పెంపొందించడంలో అనాస పువ్వు సహాయపడుతుంది. కడుపులో గ్యాస్, కడుపు ఉబ్బరం, అజీర్తి వంటి సమస్యలను సమర్థవంతంగా తగ్గిస్తుంది. అనాస పువ్వు తీసుకోవడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగు పడుతుంది. రక్తాన్ని శుద్ధి చేసి గుండెకు రక్త ప్రసరణను మెరుగుపర్చడం ద్వారా హృదయ సంబంధ వ్యాధులు రాకుండా కాపాడుతుంది. రక్తంలో షుగర్ లెవెల్స్ కంట్రోల్ చేయడంలో అనాస పువ్వు ప్రభావవంతంగా పనిచేస్తుంది. దీనివల్ల డయాబెటిస్ నియంత్రణలో ఉంటుంది. మూత్రనాళ ఇన్ఫెక్షన్‌తో బాధపడేవారు అనాస పువ్వును తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. యాంటీ ఫంగల్, యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు ఇన్ఫెక్షన్లు రాకుండా నివారిస్తాయి. మహిళల్లో పీరియడ్స్ సమయంలో వచ్చే హార్మోన్ల అసమతుల్యతను తగ్గించడంలో అనాస పువ్వు ఉపయోగపడుతుంది. నెలసరి సమయంలో వచ్చే నొప్పులను కూడా తగ్గిస్తుంది. అనాస పువ్వులోని యాంటీఆక్సిడెంట్లు అనేక రకాల ఇన్ఫెక్షన్ల నుంచి చర్మాన్ని కాపాడతాయి. చర్మ సౌందర్యాన్ని రెట్టింపు చేస్తాయి.

## రుహాని శర్మ: ప్రతి ఫ్రేమ్‌లో గ్రేస్



# ప్రభాస్ ‘ఫౌజీ‘.. హను ప్లాన్ ఎలా ఉంది? రిపీట్ చేస్తారా?




పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ లైనప్ లో ప్రస్తుతం విభిన్న జోనర్ సినిమాలు ఉన్న విషయం తెలిసిందే. అందులో ఒకటి ఫౌజీ. పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా రూపుదిద్దుకుంటున్న ఆ సినిమాకు హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్నారు. 1940వ దశకంలో జరిగే కథగా.. మాతృభూమి ప్రజలకు న్యాయాన్ని అందించడానికి ఓ యోధుడు చేసే పోరాటంగా మూవీని తెరకెక్కిస్తున్నారు. వాస్తవ సంఘటనలకు కొంత ఫిక్షన్ జోడించి హను రాఘవపూడి కథను సిద్ధం చేశారని టాక్. సినిమాలో ప్రభాస్ సైనికుడిగా కనిపించనుండగా.. ఆయన సరసన ఇమాన్వి నటిస్తున్నారు. అనుపమ్ ఖేర్, మిథున్ చక్రవర్తి, జయప్రద, భాను చందర్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. సంగీతాన్ని విశాల్ చంద్రశేఖర్ అందిస్తుండగా.. పాటలను కృష్ణకాంత్ రాస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ తో కలిసి టీ సిరీస్ నిర్మిస్తున్న ఆ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. గత ఏడాది మొదలుపెట్టారు మేకర్స్.

అయితే ఇప్పుడు దసరా కానుకగా సినిమాను విడుదల చేయనున్నారని కొన్ని గంటలుగా సోషల్ మీడియాలో వార్తలు చక్కర్లు కొడుతు న్నాయి. ఇంకా అధికారి కంగా ప్రకటన రాకపో యినా.. మేకర్స్ ఇప్పటికే ఫిక్స్ అయ్యారని తెలుస్తోంది. అందుకు తగ్గట్లే అటు షూటింగ్ ను.. ఇటు పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ ను నిర్వహిస్తున్నారని సమాచారం. మరికొన్ని రోజుల్లో రిలీజ్ డేట్ ను అఫీషియల్ గా అనౌన్స్ చేయనున్నారని వినికిడి. అదే సమయంలో ప్రభాస్ కు ఫౌజీ ఎలాంటి రిజల్ట్ ఇస్తుందనేది ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. ఎందుకంటే ప్రభాస్ రీసెంట్ గా ది రాజా సాబ్ మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చి మిక్స్ డ్ రెస్పాన్స్ అందుకున్నారు. భారీ అంచనాల మధ్య రిలీజ్ అయిన ఆ సినిమా.. అనుకున్న స్థాయిలో అందరినీ ఆకట్టుకోలేకపోవడంతో అనేక విమర్శలు వచ్చాయి.. వస్తున్నాయి. దీంతో ఫౌజీతో కమ్ బ్యాక్ ఇవ్వాలని అంతా కోరుకుంటున్నారు. అయితే ప్రభాస్ యాక్టింగ్ విషయంలో అదరగొడతారనే విషయం తెలిసిందే. అందుకే డైరెక్టర్ హనుపై మొత్తం ఆధారపడి ఉంది. నిజానికి ఎమోషన్, గ్రాండ్యూర్ కు పేరుపొందిన హను రాఘవపూడి, ఇప్పటికే పలు సినిమాలతో హిట్స్ అందుకున్నారు. ముఖ్యంగా సీతారామం మూవీతో బ్లాక్ బస్టర్ హిట్ ను సొంతం చేసుకున్నారు. తన మేకింగ్ అంట్ టేకింగ్ తో అందరినీ ఆశ్చర్యపరిచారు. అందుకే ఇప్పుడు ఫౌజీ విషయంలో కూడా అదే రిపీట్ చేస్తారని అంతా ఆశిస్తున్నారు. కేవలం సినిమా హిట్ అయ్యేలా చూడడమే కాకుండా.. ప్రభాస్ కెరీర్ లో గుర్తుండిపోయే మూవీ తీస్తారని అంచనా వేస్తున్నారు. అయితే ప్రభాస్ ను ఆయన ఇంతకు ముందు ఎప్పుడూ చూడని పవర్ ఫుల్ అవతార్ లో చూపించబోతున్నారని సమాచారం. మరి ఫౌజీ చిత్రం ఎలాంటి హిట్ అవుతుందో.. హను ప్లాన్ ఎలా ఉంటుందో.. సక్సెస్ మోడ్ రిపీట్ చేస్తారో లేదో వేచి చూడాలి.

# జాన్వీ అందరికీ పెద్దితో ఆన్సర్ ఇస్తుందా?

## మోడరన్ ఫైర్‌తో శాన్వి శ్రీవాస్తవ క్లాసిక్ బ్యూటీ





అతిలోక సుందరి శ్రీదేవి కూతురిగా సినీ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన జాన్వీ కపూర్ అతి తక్కువ సమయంలోనే తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోగలిగారు. జాన్వీ 2018లో ధడక్ అనే రొమాంటిక్ డ్రామాతో హీరోయిన్ గా అరంగేట్రం చేశారు. స్టార్ హీరోయిన్ కూతురిగా ఎంట్రీ ఇచ్చిన జాన్వీకి కెరీర్ స్టార్టింగ్ నుంచే ఏదొక విషయంలో విమర్శలు ఎదురవుతూనే ఉన్నాయి.

**మరోసారి జాన్వీపై విమర్శలు**

జాన్వీ స్థిరంగానే నటించినప్పటికీ, ఆమె యాక్టింగ్ పై విమర్శలు అన్ని సినిమాల్లోనూ జాన్వీని అనుసరించాయి. అయితే ఇప్పుడు ఇదంతా ఎందుకనుకోవచ్చు. రీసెంట్ గా జాన్వీ కపూర్ మరోసారి సోషల్ మీడియాలో విమర్శల పాలవుతున్నారు. ఉమెన్స్ లెగ్గింగ్స్ బ్రాండ్ కోసం జాన్వీ ఓ యాడ్ లో చాలా అతిగా నటించారనే ఆరోపణలతో ఆమె వార్తల్లోకెక్కారు.

**పూర్తి స్థాయి యాక్టింగ్ చూడలేదని కామెంట్స్**

జాన్వీ ఇప్పటివరకు తన కెరీర్లో 14 విభిన్న జానర్ల సినిమాల్లో యాక్ట్ చేసినప్పటికీ, జాన్వీ ఇంకా బిగ్ స్క్రీన్ పై తన యాక్టింగ్ ను పూర్తి స్థాయిలో చూపించలేదని ఓ కామెంట్ వినిపడుతూ ఉంటుంది. 2024లో జూ.ఎన్టీఆర్ తో కలిసి దేవర1 సినిమాలో నటించినప్పటికీ, ఆ సినిమాలో జాన్వీ రోల్ గ్లామర్‌కే పరిమితమైంది తప్పించి యాక్టింగ్ పరంగా పెద్దగా స్కోప్ దక్కలేదు.

మిల్లీ, గుంజన్ సక్సేనా: ది కార్గిల్ గర్ల్, ఉలాజ్, హోమ్ బౌండ్ లాంటి సినిమాల్లో జాన్వీ యాక్టింగ్ కు కొంతమేర ప్రశంసలొచ్చినప్పటికీ, ఆ సినిమాలు విమర్శకులపై మాత్రం ఎలాంటి ప్రభావాన్ని చూపలేకపోయాయి. అయితే ఇలాంటి పరిస్థితుల్లో జాన్వీ ఇప్పుడు రామ్ చరణ్ తో కలిసి తన రెండో తెలుగు సినిమాలో నటిస్తున్నారు. మార్చి 27న పెద్ది సినిమా రిలీజ్ కానుండగా, ఇప్పటికే రిలీజైన చికిరి సాంగ్ ఇన్‌స్టంట్ చార్ట్‌బస్టర్ గా నిలిచింది. అయితే ఇప్పటివరకు జాన్వీ నుంచి పూర్తి స్థాయి పెర్ఫార్మెన్స్ చూడనందున పెద్దిలో బుచ్చిబాబు అయినా ఆమెను యాక్టింగ్ ఓరియెంటెడ్ పాత్రలో చూపించబోతున్నారా అని అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మరి జాన్వీ బాలీవుడ్ లో వస్తున్న విమర్శలకు తెలుగు సినిమాతో చెక్ పెడతారేమో చూడాలి.